# వరంగల్ వాయిస్
Evening Daily

సంపుటి : 04 | సంచిక : 361
పేజీలు : 08 | వెల: రూ.5/-
మంగళవారం
నవంబర్ 25, 2025
www.epaper.warangalvoice.net | www.warangalvoice.net




8లో..

## వరంగల్ సీపీగా అవినాశ్ మహంతి?

- సోషల్ మీడియాలో విస్తృత ప్రచారం
- పోలీస్ గ్రూపుల్లో చక్కర్లు కొడుతున్న పోస్టులు




# బీసీలకు న్యాయం దక్కేనా..?

పంచాయతీ ఎన్నికల్లో బీసీలకు న్యాయం దక్కేనా అన్న అనుమానాలు సర్వత్రా వ్యక్తమవుతున్నాయి. చాలా జిల్లాల్లో గతంలో కంటే బీసీ కోటా తగ్గిపోయినట్టు గణాంకాలు వెల్లడిస్తున్నాయి. బీసీ కోటా తగ్గించడంపై బీసీ సంఘాల నేతలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. కోటా తగ్గింపునకు వ్యతిరేకంగా 30న చలో హైదరాబాద్ నిర్వహించేందుకు వారు సిద్ధపడుతున్నారు. అన్ని జిల్లాల వివరాలతో త్వరలోనే సీఎస్‌ను కలిసి ఫిర్యాదు చేయాలని నిర్ణయించారు. న్యాయం చేయకుంటే కోర్టుల ద్వారా పోరాటం చేసేందుకైనా సై అంటున్నారు. 42 శాతం రిజర్వేషన్లు దేవుడెరుగు కనీసం ఇప్పటికే ఉన్న బీసీ రిజర్వేషన్లకే రాష్ట్ర ప్రభుత్వం గండి కొడుతోందని మండిపడుతున్నారు. వాస్తవంగా 2019లో జరిగిన పంచాయతీ ఎన్నికల్లో బీసీలకు 18శాతం నుంచి 22.79 వరకు సీట్లు రిజర్వ్ అయ్యాయి. కానీ, ప్రస్తుతం రాష్ట్రంలో అనేక కొత్త పంచాయతీలు ఏర్పడినప్పటికీ, ప్రస్తుతం బీసీలకు 16 నుంచి 20 శాతానికి మించి రిజర్వేషన్లు దక్కడంలేదంటూ ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అనేక డివిజన్లు, మండలాల్లో బీసీలకు ఒకటి కూడా సర్పంచ్ సీటు రిజర్వు కాలేదని, గత ఎన్నికల్లో కంటే కనీసం రెండు, మూడు స్థానాల వరకు బీసీ కోటాను తగ్గించారని ఆందోళన వ్యక్తం అవుతోంది. –వరంగల్ వాయిస్ ప్రతినిధి

వివరాలు 2లో..

- పంచాయతీల్లో రిజర్వేషన్లపై సర్వత్రా అనుమానాలు
- అసలుకే ఎసరు పెడుతున్న ప్రభుత్వం
- తప్పుల తడకగా బీసీ గణన
- గతంకంటే సీట్లు తగ్గే చాన్స్
- ఆందోళనకు సిద్ధమవుతున్న బీసీ సంఘాలు
- 30 చలో హైదరాబాద్ కు పిలుపు

## రేపు వరంగల్‌కు కేటీఆర్

- ముఖ్య నేతలు, ప్రజా ప్రతినిధులతో కీలక భేటీ
- స్థానిక ఎన్నికలపై దిశానిర్దేశం

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కల్వకుంట్ల తారకరామారావు రేపు వరంగల్ రానున్నారు. బుధవారం ఉదయం 11 గంటలకు బాలసముద్రంలోని హనుమకొండ జిల్లా బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ముఖ్య నేతలు, ప్రజా ప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులతో ఆయన సమావేశం కానున్నారు. స్థానిక సంస్థల ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా భావిస్తున్న నాయకత్వం ఇప్పటి నుంచే పార్టీ శ్రేణులను సమాయత్తం చేసే పనిలో పడింది. అదే విధంగా ఈ నెల 29న నిర్వహించనున్న దీక్ష దివాస్ ఏర్పాట్లపైకూడా సమీక్షించనున్నారు. ఇప్పటికే కేటీఆర్ పర్యటనకు సంబంధించి షెడ్యూల్ ఖరారుకాగా ఇందుకు సంబంధించిన ఏర్పాట్లలో పార్టీ నేతలు తలమునకలయ్యారు. ఉమ్మడి జిల్లాలోని వివిధ మండలాలు, కార్పొరేషన్లు, మున్సిపాలిటీల్లోని వివిధ డివిజన్లకు చెందిన బీఆర్ఎస్ ప్రతినిధులు, మండల, గ్రామ, డివిజన్ అనుబంధ కమిటీల అధ్యక్ష, కార్యదర్శులు, కమిటీ సభ్యులు, సమన్వయ కమిటీ సభ్యులు, ప్రజా ప్రతినిధులు, మాజీ ప్రజా ప్రతినిధులు ఈ భేటీకి హాజరుకానున్నారు.
– వరంగల్ వాయిస్, వరంగల్





8లో..

## రైతు డిక్లరేషన్ పేరుతో కాంగ్రెస్ మోసం

- నిండా ముంచుతున్న సర్కార్
- బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర అధ్యక్షులు లక్ష్మీ నర్సయ్య, గంట రవి

## రూ. 304 కోట్ల వడ్డీ లేని రుణాలు

- ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపిన ఎమ్మెల్యే నాగరాజు
- పాల్గొన్న కలెక్టర్, రాష్ట్ర కో-ఆపరేటివ్ అపెక్స్ బ్యాంక్ చైర్మన్ మార్నేని



8లో..

## మోగిన నగారా..

- డిసెంబర్ 11, 14, 17 తేదీల్లో ఎన్నికలు
- నేటినుంచి ఎన్నికల కోడ్ అమలు

# బీసీలకు న్యాయం దక్కేనా..?




- పంచాయతీల్లో రిజర్వేషన్లపై సర్వత్రా అనుమానాలు
- అసలుకే ఎసరు పెడుతున్న ప్రభుత్వం
- తప్పుల తడకగా బీసీ గణన
- గతంకంటే సీట్లు తగ్గే చాన్స్
- ఆందోళనకు సిద్ధమవుతున్న బీసీ సంఘాలు
- 30న చలో హైదరాబాద్ కు పిలుపు

**వరంగల్ వాయిస్ ప్రతినిధి :** పంచాయతీ ఎన్నికలకు సంబంధించి బీసీ రిజర్వేషన్ల కేటాయింపులో గందరగోళం నెలకొందని పలు బీసీ సంఘాల నేతలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. బీసీ కోటా గతం కంటే తగ్గిపోవడంపై ఆగ్రహం వ్యక్తమవుతోంది. అన్ని జిల్లాల వివరాలతో త్వరలోనే సీఎస్‌ను కలిసి ఫిర్యాదు చేస్తాం అంటున్నారు. అవసరమైతే న్యాయ పోరాటం చేసేందుకైనా సిద్ధంగా ఉన్నట్లు ప్రకటిస్తున్నారు. కాంగ్రెస్ పార్టీలోని బీసీ మంత్రులు, ప్రజాప్రతినిధులు ఈ అన్యాయంపై తక్షణం స్పందించాలని వారు కోరుతున్నారు. కోటా తగ్గింపునకు వ్యతిరేకంగా 30న చలో హైదరాబాద్ నిర్వహిస్తాం అంటూ బీసీ నేత జాజుల శ్రీనివాస్ గౌడ్ తెలిపారు.

### తగ్గిన కోటా..

చాలా జిల్లాల్లో గతంలో కంటే బీసీ కోటా తగ్గిపోయినట్లు గణాంకాలు వెల్లడిస్తున్నాయి. 42 శాతం రిజర్వేషన్లు దేవుడెరుగు కనీసం ఇప్పటికే ఉన్న బీసీ రిజర్వేషన్లకే రాష్ట్ర ప్రభుత్వం గండి కొడుతోందని మండిపడుతున్నారు. వాస్తవంగా 2019లో జరిగిన పంచాయతీ ఎన్నికల్లో బీసీలకు 18శాతం నుంచి 22.79 వరకు స్థానాలు రిజర్వ్ అయ్యాయి. కానీ, ప్రస్తుతం రాష్ట్రంలో అనేక కొత్త పంచాయతీలు ఏర్పడినప్పటికీ, ప్రస్తుతం బీసీలకు 16 నుంచి 20 శాతానికి మించి రిజర్వేషన్లు దక్కడంలేదన్న భావన వ్యక్తమవుతోంది. అనేక డివిజన్లు, మండలాల్లో బీసీలకు ఒకటి కూడా సర్పంచ్ సీటు రిజర్వు కాలేదని, గత ఎన్నికల్లో కంటే కనీసం రెండు మూడు స్థానాల వరకు బీసీ కోటాను తగ్గించారని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. స్థానిక సంస్థల్లో రిజర్వేషన్లు ఖరారు చేసేందుకు ప్రభుత్వం మార్గదర్శకాలు జారీచేస్తూ జీవో–46 విడుదల చేసింది. సర్పంచ్ స్థానాలకు 2011 జనాభా లెక్కలను, వార్డు మెంబర్ స్థానాలకు 2024 ఇంటింటి సర్వే లెక్కలను పరిగణన లోకి తీసుకోవాలని స్పష్టం చేసింది.

### అయోమయం..

రాష్ట్రాలు నిర్వహించిన కులగణన సర్వేలకు చట్టబద్ధత లేదని, పారదర్శకత ఉండబోదని, ఆ సర్వే గణాంకాలు చెల్లబోవని కేంద్రం ఇప్పటికే అనేకసార్లు తేల్చి చెప్పింది. ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం మాత్రం ఇంటింటి సర్వే గణాంకాలను ప్రామాణికంగా తీసుకోవాలని చెప్పడం చర్చనీయాంశంగా మారింది. జనాభా గణన అంశం 7వ షెడ్యూల్‌లో కేంద్ర జాబితాలోని అంశం. గణాంకాల సేకరణ చట్టం–2008 ప్రకారం సర్వే నిర్వహించాలన్నా కొన్ని నిబంధనలను పాటించాల్సి ఉంది. స్వయం ప్రతిపత్తి కలిగిన కమిషన్‌ను ఏర్పాటు చేయడంతోపాటు గణాంకాల సేకరణకు ఒక ప్రభుత్వ శాఖను నోడల్ డిపార్ట్‌మెంట్‌గా నియమించాలి. నేషనల్ ప్లానింగ్ అండ్ ఇంప్లిమెంటేషన్ డిపార్ట్‌మెంట్, స్టాటిస్టిక్స్ డిపార్ట్‌మెంట్, ఎన్ఎస్ఎస్‌వో తదితర విభాగాల నుంచి రాష్ట్రానికి చెందిన తాజా ఇండ్ల జాబితాను, బ్లాక్‌వారీగా రూపొందించిన హౌసింగ్ మ్యాపులను కూడా తీసుకోవాల్సి ఉంటుంది. ప్రజల సామాజిక, ఆర్థిక, విద్య, ఉద్యోగ, ఉపాధి, రాజకీయ అవకాశాలకు సంబంధించిన స్థితిగతులను తులనాత్మక అధ్యయనం చేయాల్సి ఉంటుంది. వీటన్నింటినీ క్రోడీకరించి, విశ్లేషించి కేంద్రం ఆమోదంతో ఆ గణాంకాలను ప్రామాణికంగా పరిగణనలోకి తీసుకునే అవకాశముంటుంది.

### ఇంటింటి సర్వే ఆధారంగానే..

కాంగ్రెస్ పార్టీ రాష్ట్రంలో అధికారంలోకి వచ్చాక రూ.160 కోట్ల వ్యయంతో రాష్ట్ర ప్రణాళిక శాఖ ఆధ్వర్యంలో 2024 నవంబర్‌లో ఇంటింటి సర్వే నిర్వహించింది. రాష్ట్రంలో మొత్తంగా 3.7 కోట్ల మంది జనాభా ఉండగా, అందులో 96.9శాతం మందిని సర్వే చేసి వివరాలను సేకరించినట్లు ప్రకటించింది. ఆ లెక్కనే 100 శాతం కరెక్టని కాంగ్రెస్ చెప్పుకుంటోంది. అయితే స్థూలంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఓసీ, మైనారిటీ వర్గాల గణాంకాలనే బయటపెట్టింది. కులాలు, ఉపకులాల వారీగా వివరాలను మాత్రం గోప్యంగా దాచిపెట్టింది. పూర్తిస్థాయి నివేదికను వెల్లడించకపోవడం, అభ్యంతరాలను స్వీకరించకపోవడంతో సర్వే గణాంకాలకు సాధికారత లేకుండా పోయిందని పలు బీసీ నేతలు అంటున్నారు. కానీ, తాజాగా ఆ గణాంకాలనే ప్రామాణికంగా తీసుకుని స్థానిక రిజర్వేషన్లు ఖరారు చేయాలని మార్గదర్శకాలు జారీ చేయడంపై చర్చ కొనసాగుతోంది.



### కేంద్రం పరిధిలోనే కుల గణన..

కులగణన అంశం పూర్తిగా కేంద్రం పరిధిలోనిదేనని కేంద్రం గతంలోనే స్పష్టం చేసింది. దేశవ్యాప్తంగా చేపట్టబోయే జనాభా గణనలో కులగణనను కూడా నిర్వహించాలని ఆ కమిటీ నిర్ణయించింది. అందుకు సంబంధించి షెడ్యూల్ ను కూడా ఇప్పటికే ప్రకటించింది. కానీ, రాష్ట్ర ప్రభుత్వం మాత్రం 2024 ఇంటింటి సర్వే గణాంకాలను ప్రామాణికంగా తీసుకోవడం ఇప్పుడు అనేక వివాదాలకు తావిస్తోంది. ఈ క్రమంలోనే ఆయా స్థానాలకు సంబంధించిన రిజర్వేషన్ల రొటేషన్ పక్రియను సైతం నిబంధనలకు విరుద్ధంగా నిర్వహించారనే ఆరోపణలొస్తున్నాయి. 2019కి ముందు ఏర్పడిన పంచాయతీలు, మండలాలు, జిల్లాలకు మాత్రమే రొటేషన్ వర్తిస్తుంది. 2019 తరువాత ఏర్పడిన నూతన పంచాయతీలు, మండలాలు, జిల్లాలకు రొటేషన్ వర్తించదు. మొదటినుంచి రోస్టర్‌ను తీసుకోవాల్సి ఉంటుంది. రొటేషన్ ఎలా చేయాలంటే తొలుత ఎస్టీ జనరల్, మహిళలు, ఎస్సీ జనరల్, ఎస్సీ మహిళలు, బీసీ జనరల్, బీసీ మహిళలు, జనరల్ స్థానాలుగా మార్చాలి. ఈ రొటేషన్ క్రమాన్ని కూడా పాటించలేదని తెలుస్తోంది. అంతేకాకుండా, కొన్ని స్థానాలకు 2011 జనాభాల లెక్కలను, మరికొన్ని స్థానాలకు 2024 ఇంటింటి సర్వే జనాభా లెక్కలను పరిగణనలోకి తీసుకోవడం కూడా గందరగోళానికి దారితీసిందని పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కొన్ని స్థానాల రిజర్వేషన్‌ను మార్పు చేయకుండా యథాతథంగా కొనసాగించారని అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయి. ఈ రొటేషన్ పద్ధతిలో ఎక్కువగా బీసీలకు అన్యాయం జరిగిందనే విమర్శలున్నాయి.

# రూ. 304 కోట్ల వడ్డీ లేని రుణాలు



**వరంగల్ వాయిస్, వర్ధన్నపేట :** మహిళా సంక్షేమానికి సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని, రాష్ట్రంలోని కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయడమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే కేఆర్. నాగరాజు తెలపారు. వర్ధన్నపేట మున్సిపాలిటీలోనీ ఎమ్మెల్యే అధికార క్యాంప్ కార్యాలయ ఆవరణలో పర్వతగిరి, వర్ధన్నపేట, ఐనవోలు, హసన్ పర్తి మండలాలకు చెందిన మహిళ సంఘాలకు ఇందిరమ్మ స్వయం సహాయక వడ్డీలేని రుణాల చెక్కులను జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద, తెలంగాణ రాష్ట్ర కో–ఆపరేటివ్ అపెక్స్ బ్యాంక్ చైర్మన్ మార్నేని రవీందర్ రావులతో కలిసి వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు పంపిణీ చేశారు. అంతకుముందు జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మొంథా తుఫాన్ ప్రభావంతో దెబ్బతిన్న కుటుంబాలకు రేషన్ బియ్యం పంపిణీ చేశారు. అనంతరం ఎమ్మెల్యే నాగరాజు మాట్లాడుతూ.. మహిళలను ఆర్థికంగా నిలబెట్టడం పట్ల ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తుందన్నారు. తాజాగా రూ.304 కోట్ల వడ్డీలను చెల్లించినట్టు పేర్కొన్నారు. దీంతో ఇప్పటివరకు గ్రామీణ సంఘాలకు రూ. 1,118 కోట్ల వడ్డీ రహిత రుణాలు చేరాయన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రికి, రాష్ట్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ సంధ్యా రాణి, సీఆర్డీఓ రాంరెడ్డి, సంబంధిత అధికారులు, మహిళ సంఘం సభ్యులు, ఇల్లంద వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ నరుకుడు వెంకటయ్య, ఐనవోలు ఆలయ కమిటీ చైర్మన్ కమ్మగోని ప్రభాకర్ గౌడ్, ఆత్మకూర్ ఏఎంసి వైస్ చైర్మన్ తంగెళ్ళపల్లి తిరుపతి, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఆడపిల్లకు ఆర్థిక స్వాతంత్ర్యం ముఖ్యం

- చారిటబుల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ డాక్టర్ ఎ.రాజేంద్రప్రసాద్
- ఘనంగా అంతర్జాతీయ స్త్రీ హింస వ్యతిరేక దినోత్సవ సదస్సు




**వరంగల్ వాయిస్, వరంగల్ :** ఆడపిల్లకు ఆర్థిక స్వాతంత్రం ముఖ్యమని డాక్టర్ రాజేంద్రప్రసాద్–భారతి చారిటబుల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ డాక్టర్ ఎ.రాజేంద్రప్రసాద్ అన్నారు. వరంగల్ రామన్నపేటలోని డాక్టర్ రాజేంద్రప్రసాద్ భారతి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మంగళవారం అంతర్జాతీయ స్త్రీ హింస వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకొని స్థానిక ఆంధ్ర బాలిక పాఠశాలలోని ఎనిమిది, తొమ్మిది, పదో తరగతి బాలికలకు ట్రస్ట్ చే అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశానికి ప్రధానోపాధ్యాయులు వాణి ప్రియదర్శిని అధ్యక్ష వహించగా ముఖ్యఅతిథిగా భారతి కూరాకుల విచ్చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నేటి విద్యార్థినులు శారీరకంగా, మానసికంగా, విజ్ఞాన పరంగా అభివృద్ధి చెందడంతోపాటు ధైర్యంగా నిలవాలని సూచించారు. మేనేజింగ్ ట్రస్టీ డాక్టర్ ఎ.రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ పిల్లలు, మహిళలు హింసనుంచి రక్షణ పొందేందుకు చట్టాలున్నాయన్నారు. అత్యవసర పరిస్థితిలో 181 నెంబర్ కు ఫోన్ చేసి రక్షణ పొందవచ్చన్నారు. అదేవిధంగా ఇంట్లో తల్లిదండ్రులు అసవసర ఘర్షణకు పాల్పడితే సామరస్యంగా సమస్యను పరిష్కరించాల్సిన బాధ్యత మీపైనే ఉందన్నారు. మీరు ఇతరులకు మార్గదర్శకులుగా నిలవాలన్నారు. ఆడపిల్లకు ఆర్థిక స్వాతంత్రం ముఖ్యమన్నారు. ఆర్థిక స్పందన ఉంటే వాళ్లు చాలా కాన్ఫిడెంట్ గా ఉండగలుగుతారన్నారు. అప్పుడే వాళ్లు బాగా చదువుకుని వాళ్ల కాళ్ల మీద వారు నిలబడతారన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు శారద, సునీత, నీలిమ, నిర్మల, శ్యామల, మాదిగల రాజమణి, రాజ్యలక్ష్మి, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

WARANGALVOICE
www.epaper.warangalvoice.net
www.warangalvoice.net

వరంగల్ వాయిస్ Evening Daily

GRATER WARANGAL
Hanamkonda | Mahabubabad | Jangaon | Dornakal
Bhupalapaly | Mulugu | Parakala | Narsampet
Station Ghanpur | Palakurthy | Waradannapet

మంగళవారం, నవంబర్ 25, 2025

# వర్ధన్నపేట ప్రజల కల నెరవేరింది

- 100 పడకల ఆస్పత్రి నిర్మాణానికి భూమిపూజ
- రూ.28 కోట్లతో నిర్మాణం



**వరంగల్ వాయిస్, వర్ధన్నపేట:** వర్ధన్నపేట, పర్వతగిరి, ఐనవోలు మండలాల ప్రజల దీర్ఘకాలిక అవసరాన్ని దృష్టిలో ఉంచుకుని, ఉప్పరపల్లి క్రాస్ రోడ్ వద్ద సుమారు రూ.28 కోట్ల నిధులతో నిర్మించనున్న 100 పడకల ఆధునిక ప్రభుత్వ ఆసుపత్రి నిర్మాణానికి మంగళవారం భూమిపూజ చేశారు. వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు, వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద, టీజీ క్యాబ్ చైర్మన్ లతో కలిసి ఈ శంకుస్థాపన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాగరాజు మాట్లాడుతూ, తెలంగాణ ప్రజా ప్రభుత్వం చిత్తశుద్ధితో వర్ధన్నపేట నియోజకవర్గ సమగ్ర అభివృద్ధికి కృషి చేస్తోందని అన్నారు. విద్య, వైద్య రంగాలపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని తెలిపారు. 100 పడకల ఆసుపత్రి ఈ ప్రాంత ప్రజల కల అని, అన్ని మండలాల ప్రజలకు అందుబాటులో ఉండాలనే ఉద్దేశంతో ఉప్పరపల్లి వద్ద ఈ పనులను చేపడుతున్నామని, వీలైనంత త్వరగా ఆసుపత్రి పనులను పూర్తి చేస్తామని చెప్పారు. ఈ ప్రాంతానికి డయాలసిస్ సెంటర్ కూడా మంజూరైందని తెలిపారు. డయాలసిస్ సెంటర్ మంజూరుకు సహకరించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రి దామోదర రాజనర్సింహ లకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. త్వరలోనే మున్సిఫ్ కోర్టు ప్రారంభమవుతుందని, నియోజకవర్గానికి స్టేడియం కూడా మంజూరు అవుతుందని ఆయన ప్రకటించారు. వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద జల సంరక్షణలో అవార్డు అందుకున్నందుకు అభినందనలు తెలిపారు. మహిళా కలెక్టర్ అయి కూడా నిత్యం ప్రజల్లో ఉంటూ జిల్లా అభివృద్ధికి కృషి చేస్తున్నారని ప్రశంసించారు. వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద మాట్లాడుతూ వర్ధన్నపేట నియోజకవర్గం వేగంగా అభివృద్ధి చెందుతున్న ప్రాంతమని, మామునూరు ఎయిర్పోర్ట్ ఏర్పాటుతో ఈ ప్రాంతం మరింత అభివృద్ధి చెందుతుందని అన్నారు. 100 పడకల ఆసుపత్రి ఏర్పాటుతో ఎంజీఎం ఆస్పత్రిపై భారం తగ్గుతుందని తెలిపారు.ప్రస్తుతం రోజుకు 300 నుంచి 400 మంది ఓపీ పేషెంట్లు వస్తున్నారని, భవిష్యత్తులో ఈ సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని, ఈ ప్రాంతాన్ని మెడికల్ హబ్‌గా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తామని పేర్కొన్నారు. ఈ ఆసుపత్రి ద్వారా అత్యవసర సేవలు, ప్రసూతి సేవలు, శస్త్రచికిత్సలు, పిల్లల వైద్య సేవలు వంటి నాణ్యమైన ఆరోగ్య సేవలు ప్రజలకు అందుబాటులోకి రానున్నాయి. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ సంధ్యారాణి, డీఎంహెచ్ఓ డాక్టర్ సాంబ శివరావు, డీసీహెచ్ రామ్మూర్తి, పర్యవేక్షకులు నరసింహ స్వామి, ఇల్లంద వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ నరుకుడు వెంకటయ్య, ఐనవోలు ఆలయ కమిటీ చైర్మన్ ప్రభాకర్ గౌడ్, ఆత్మకూర్ ఏఎంసీ వైస్ చైర్మన్ తిరుపతి, స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

# కాళేశ్వరం ప్రెస్ క్లబ్ నూతన కార్యవర్గం ఏకగ్రీవం



**వరంగల్ వాయిస్, మహాదేవపూర్/కాళేశ్వరం :** జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాదేవపూర్ మండలం కాళేశ్వరంలోని ప్రెస్ క్లబ్ నూతన కార్యవర్గాన్ని మంగళవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సభ్యులంతా ఏకతాటిపై నిలబడి నూతన కమిటీని ఎన్నుకున్నారు. నూతన కార్యవర్గంలో అధ్యక్షుడిగా కోరుకొప్పుల సదాశివ్, ఉపాధ్యక్షులుగా తోట చంద్రశేఖర్, రెవెల్లి రాకేష్, ప్రధాన కార్యదర్శిగా మేకల మహేష్, సహాయ కార్యదర్శులుగా కోండ్ర తిరుపతి గౌడ్, రెవెల్లి రాజబాబు, రెవెల్లి సంతోష్ కుమార్, కోశాధికారిగా రెవెల్లి రాజశేఖర్, కార్యవర్గ సభ్యులుగా కొండగొర్ల సంతోష్, తాళ్లపల్లి రాజశేఖర్ లు ఎన్నికయ్యారు. ఈ ఎన్నికల ప్రక్రియలో ప్రెస్ క్లబ్ సభ్యులు నిట్టూరి నగేష్, కావేరి రామకృష్ణ, గాడిచర్ల కిషన్ తదితరులు పాల్గొన్నారు. నూతనంగా ఎన్నికైన కార్యవర్గానికి సభ్యులంతా శుభాకాంక్షలు తెలిపారు.

# కాలనీలో సమస్యలు పరిష్కరించాలి

## ఎమ్మెల్యే కేఆర్ నాగరాజుకు వినతి



**వరంగల్ వాయిస్, హనుమకొండ:** గుండ్ల సింగారం పరిధిలోని జీవీఎస్ఆర్ కాలనీ వాసులు తమ కాలనీలో నెలకొన్న పలు సమస్యల పరిష్కారం కోసం స్థానిక వర్ధన్నపేట ఎమ్మెల్యే నాగరాజును మర్యాదపూర్వకంగా కలిశారు. కాలనీ అభివృద్ధి కమిటీ సభ్యులు ఎమ్మెల్యేకు తమ సమస్యలపై వినతి పత్రం సమర్పించారు. కాలనీలో అత్యవసరంగా చేపట్టాల్సిన సీసీ రోడ్ల నిర్మాణం, మెరుగైన డ్రైనేజీ వ్యవస్థ ఏర్పాటు, విద్యుత్ స్తంభాల మరమ్మతులు/ఏర్పాట్లు వంటి ముఖ్య సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లారు. సమస్యలను ఆలకించిన ఎమ్మెల్యే నాగరాజు సానుకూలంగా స్పందించారు. కాలనీ వాసులకు భరోసా ఇస్తూ, తక్షణమే అభివృద్ధి పనులు మొదలు పెట్టేందుకు చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా మాజీ జడ్పీటీసీ సింగ్ లాల్, జీవీఎస్ఆర్ కాలనీ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు కుక్కల రాజు, ఉపాధ్యక్షులు రుద్రారం ప్రశాంత్, ప్రధాన సలహాదారుడు కుక్కమూడి వంశీ, కోశాధికారి వైనాల యాకయ్య, కమిటీ సభ్యులు మల్లయ్య, పరమాత్మ, కొమురయ్య, సుమన్, దాసరి అరుణ్ పాల్గొన్నారు.

# కేటీఆర్ పర్యటనను విజయవంతం చేయాలి



**వరంగల్ వాయిస్, పరకాల:** బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ బుధవారం వరంగల్ పర్యటనను విజయవంతం చేయాలని పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి బీఆర్ఎస్ శ్రేణులకు పిలుపునిచ్చారు. కేటీఆర్ బుధవారం ఉదయం 11:00 గంటలకు హనుమకొండ జిల్లా పార్టీ కార్యాలయంలో ముఖ్య సమావేశంలో పాల్గొననున్నారు. ఈ సమావేశం ప్రధానంగా ఈ నెల 29న జరగనున్న 'దీక్ష దివాస్' కార్యక్రమంపై, త్వరలో జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికల సన్నాహక వ్యూహాలపై ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి పరకాల నియోజకవర్గంలోని కింది స్థాయి వరకు ఉన్న ప్రతి ఒక్క బీఆర్ఎస్ నాయకుడు, కార్యకర్త తప్పకుండా హాజరై సమావేశాన్ని విజయవంతం చేయాలని చల్లా ధర్మారెడ్డి కోరారు. పరకాల, నడికూడ, ఆత్మకూర్, దామెర, గీసుగొండ, సంగెం మండలాల ముఖ్య నాయకులు, పరకాల మున్సిపాలిటీ, జీడబ్ల్యూఎంసీ 15, 16, 17 డివిజన్ల నాయకులు, బీఆర్ఎస్ పార్టీ మండల, గ్రామ, డివిజన్, అనుబంధ కమిటీల అధ్యక్ష, కార్యదర్శులు, కమిటీ సభ్యులు, సమన్వయ కమిటీ సభ్యులు, యూత్ కమిటీ సభ్యులు, మాజీ ఎంపీపీలు, జడ్పీటీసీలు, సర్పంచులు, ఎంపీటీసీలు, కౌన్సిలర్లు, కార్పొరేటర్లు, మార్కెట్, సొసైటీ చైర్మన్లు, డైరెక్టర్లు, పార్టీ కుటుంబ సభ్యులు తప్పకుండా హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

# రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీలకు ఆర్డీఎఫ్ విద్యార్థిని ఎంపిక




**వరంగల్ వాయిస్, పర్వతగిరి:** వరంగల్ జిల్లా పర్వతగిరి మండలం కల్లెడ గ్రామంలోని ఆర్డీఎఫ్ వనిత అచ్చుతాపై విద్యాలయ జూనియర్ కళాశాల కీర్తి ప్రతిష్టలను పెంచుతూ, ఇంటర్మీడియట్ బైపీసీ మొదటి సంవత్సరం చదువుతున్న విద్యార్థిని గుగులోతు వెన్నెల రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపికయ్యారు. ఎస్జీఎఫ్ (స్కూల్ గేమ్స్ ఫెడరేషన్) ఆధ్వర్యంలో జవహర్ లాల్ నెహ్రూ స్టేడియం, హనుమకొండలో నిర్వహించిన జోనల్ క్రీడా పోటీల్లో వెన్నెల అద్భుత ప్రదర్శన కనబరిచారు. ఆమె ప్రతిభను గుర్తించిన ఎంపిక కమిటీ, బాలికల అండర్-19 జట్టుకు వెన్నెలను ఎంపిక చేసింది. ఈ నెల 28, 29, 30 తేదీలలో సిరిసిల్లలో జరగనున్న రాష్ట్రస్థాయి మీట్‌లో ఆమె పాల్గొననున్నారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ ఆడెపు జనార్ధన్ మాట్లాడుతూ వెన్నెల కృషి, ఆటపై ఉన్న పట్టుదల, అంకితభావంతో రాష్ట్రస్థాయి పోటీల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి విజయం సాధించాలని అభినందించారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపల్ రాజు, అకాడమిక్ హెడ్ ప్రవీణ్, ఏవో సతీష్, పి.ఇ.టి. కోకిల మరియు అధ్యాపక బృందం సభ్యులు జయశంకర్, ధన్య, శ్రీధర్, మహేశ్వర్, సంతోష్, సైదులు, శ్రీలత, గుంశావళి తదితరులు గుగులోతు వెన్నెలకు శుభాకాంక్షలు తెలియజేశారు.

# నూతన విత్తన చట్టంపై అవగాహన సదస్సు




**వరంగల్ వాయిస్, నడికూడ:** రాష్ట్ర వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధ్యక్షతన ఏర్పాటు చేసిన నూతన విత్తన చట్టం-2025 ముసాయిదాపై రాష్ట్రవ్యాప్త అవగాహన కార్యక్రమం నడికూడ రైతు వేదికలో జరిగింది. ఈ కార్యక్రమాన్ని రైతు వేదికల నుంచి ప్రత్యక్ష వీడియో కాన్ఫరెన్స్ ద్వారా నిర్వహించారు. అదేవిధంగా, జాతీయ ఆహార భద్రతా పథకంలో భాగంగా సబ్సిడీపై వరి, మొక్కజొన్న విత్తనాలను రైతులకు అందించారు. ఈ కార్యక్రమంలో భాగంగా నడికూడ రైతు వేదిక నుంచి పరకాల మార్కెట్ కమిటీ చైర్మన్ చందుపట్ల రాజిరెడ్డి, పరకాల సహాయ వ్యవసాయ సంచాలకులు జగదీశ్వర్ రెడ్డి ప్రత్యక్ష వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. అనంతరం వారు సబ్సిడీ విత్తనాలను రైతులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మార్కెట్ కమిటీ చైర్మన్ రాజిరెడ్డి రైతులను ఉద్దేశించి మాట్లాడుతూ నూతన విత్తన చట్టంలో, నాణ్యత లేని విత్తనం ద్వారా రైతుకు ఏదైనా నష్టం జరిగినప్పుడు, రైతుకు నష్టపరిహారం అందే విధంగా చట్టం ఉండాలని ప్రభుత్వాన్ని కోరారు. వరి, మొక్కజొన్న విత్తనాలను ఉత్పత్తి కొరకు సాగు చేసే రైతులు తప్పకుండా సదరు కంపెనీ నుంచి అగ్రిమెంట్ చేసుకోవాలని సూచించారు. రైతులు అప్రమత్తంగా ఉండి, కంపెనీలతో అగ్రిమెంట్ చేసుకున్న తర్వాతే విత్తనాలు తీసుకోవాలని తెలిపారు. విత్తన కంపెనీలు కూడా తిరిగి కొనుగోలు చేసే సమయంలో తప్పకుండా మార్కెట్ రుసుము చెల్లించాలని సూచించడం జరిగింది. ఈ అవగాహన సదస్సులో మండల వ్యవసాయ అధికారి పోరిక జైసింగ్, వ్యవసాయ విస్తరణ అధికారులు జనగం ప్రదీప్ కుమార్, రామకృష్ణ తో పాటు పలువురు రైతులు పాల్గొన్నారు.

# తక్షణమే 'రైతు భరోసా' విడుదల చేయాలి



**వరంగల్ వాయిస్, పరకాల:** తెలంగాణ రాష్ట్రంలో అకాల వర్షాల కారణంగా రబీ పంటలు తీవ్రంగా దెబ్బతిని రైతులు ఆర్థిక ఇబ్బందుల్లో కూరుకుపోయారని, ఇలాంటి క్లిష్ట పరిస్థితుల్లో రాష్ట్ర ప్రభుత్వం వెంటనే 'రైతు భరోసా' నిధులను విడుదల చేసి రైతులకు రక్షణ కల్పించాలని వరంగల్ ఉమ్మడి జిల్లా రైతు రక్షణ సమితి అధ్యక్షుడు వరికెల కిషన్‌రావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా కిషన్‌రావు మాట్లాడుతూ అకాల వర్షాల ప్రభావంతో పత్తి, మిరప, మొక్కజొన్న, వరి పంటలు పెద్ద ఎత్తున నష్టపోయాయని ఆందోళన వ్యక్తం చేశారు. ముఖ్యంగా పత్తి పంటకు ఎకరాకు ఆరు క్వింటాళ్లు కూడా దిగుబడి రాలేదని తెలిపారు. దిగుబడి తగ్గిపోవడంతో రైతులు తీవ్ర అప్పుల బారినపడ్డారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం రైతులు యాసంగి సాగుకు సిద్ధమవుతున్న సమయమని, ఇప్పటికే పత్తి చేనులను తొలగించి, తదుపరి పంట కోసం విత్తనాలు, పెట్టుబడి ఏర్పాటులో ఉన్నారని కిషన్‌రావు వివరించారు. ఈ తరుణంలో రైతులను ఆదుకునేందుకు ప్రభుత్వం తక్షణమే రైతు భరోసా నిధులను రైతుల ఖాతాల్లో జమ చేయాలని ఆయన గట్టిగా డిమాండ్ చేశారు.

# రైతాంగ ఉద్యమాల బలోపేతమే లక్ష్యం

◆ డిసెంబర్ 9, 10న జాతీయ సమావేశాలు
◆ ప్రచార పత్రాల ఆవిష్కరణ



**వరంగల్ వాయిస్, వరంగల్ :** మోడీ ప్రభుత్వ వినాశకర విధానాలతో సంక్షోభంలో కూరుకుపోయిన వ్యవసాయ రంగాన్ని, రైతులను కాపాడుకునేందుకు ఐక్య రైతాంగ ఉద్యమాలను నిర్మించాల్సిన తక్షణ ఆవశ్యకత ఉందని ఏఐకేఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పెద్దారపు రమేష్, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి గోనె కుమారస్వామి అన్నారు. ఈ క్రమంలోనే దేశంలో రైతాంగ ఉద్యమాలను మరింత బలోపేతం చేసేందుకు అఖిల భారత రైతు సమాఖ్య, జమ్మూరి కిసాన్ సభ ఐక్యంగా ముందుకు సాగేందుకు డిసెంబర్ 9, 10 తేదీల్లో వరంగల్ జిల్లాలో జాతీయ స్థాయి సమావేశాలు నిర్వహించనున్నట్లు వారు తెలిపారు. మంగళవారం హైదరాబాద్‌లోని ఓంకార్ భవన్‌లో ఏఐకేఎఫ్ రాష్ట్ర కమిటీ ముఖ్య కార్యకర్తల సమావేశం రాష్ట్ర అధ్యక్షుడు వస్కుల మట్టయ్య అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో డిసెంబర్ 9, 10 తేదీల్లో జరగనున్న జాతీయ సమావేశాల ప్రచార కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ పాలకులు తమ స్వార్థ రాజకీయాల కోసం రైతులను, కార్మికులను బలి పశువులను చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. పంటల ఉత్పత్తి ఖర్చులను విపరీతంగా పెంచి, రైతులు కష్టపడి పండించిన పంటలకు కనీస మద్దతు ధర కల్పించడం లేదని విమర్శించారు. మార్కెట్‌లో దోచుకుంటున్న వ్యాపారులు, దళారులకు ప్రభుత్వం అండగా నిలుస్తోందని ఆరోపించారు. పెట్టుబడిదారీ కార్పొరేట్ అనుకూల చట్టాలను, విధానాలను రూపకల్పన చేస్తూ, గతంలో ఎన్నో పోరాటాలతో సాధించుకున్న చట్టాలను సైతం మార్చివేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఢిల్లీ సరిహద్దుల్లో ఉద్యమించిన రైతాంగానికి కేంద్రం రాతపూర్వక హామీలు ఇచ్చినా, ఆచరణలో విస్మరించి పరోక్షంగా రైతు వ్యతిరేక నల్ల చట్టాలను అమలు చేస్తోందని పేర్కొన్నారు. పత్తి, మొక్కజొన్న దిగుమతులపై సుంకాలను ఎత్తివేయడం, పత్తి కొనుగోళ్లలో అనేక ఆంక్షలు విధించడం, కార్మిక చట్టాలను మార్చి 4 లేబర్ కోడ్‌లుగా విభజించడం వంటి రైతు, కార్మిక వ్యతిరేక విధానాలను నేతలు తీవ్రంగా ఖండించారు. ఇలాంటి పరిస్థితుల్లో దేశాన్ని కాపాడుకునేందుకు, రైతాంగాన్ని రక్షించేందుకు బలమైన ఉద్యమాలను చేపట్టాల్సిన అవసరం ఏర్పడిందన్నారు. ఈ క్రమంలోనే ఏఐకేఎఫ్, జేకేఎస్ సంస్థలు ప్రణాళికాబద్ధంగా విలీనం కావడానికి కీలకమైన ఐక్య సమావేశాలు డిసెంబర్ 9, 10 తేదీల్లో వరంగల్ జిల్లా గిర్నిబావిలోని జి.ఆర్.బి కన్వెన్షన్ హాల్‌లో జరుగుతున్నాయని తెలిపారు. ఈ సమావేశంలో వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు వరికుప్పల వెంకన్న, ఏఐకేఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎన్.రెడ్డి హంసరెడ్డి, రాష్ట్ర నాయకులు తుకారాం నాయక్, మంద రవి, తుకారం భాస్కర్, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

# ఉచిత మెగా కంటి వైద్య శిబిరం



**వరంగల్ వాయిస్, పరకాల:** రైతులు, హమాలీ కూలీల ఆరోగ్య సంరక్షణ లక్ష్యంగా, శరత్ ఐ హాస్పిటల్ సహకారంతో పరకాల వ్యవసాయ మార్కెట్ కమిటీ పరిధిలో ఉచిత మెగా కంటి వైద్య శిబిరం నిర్వహించారు. మార్కెట్ కమిటీ చైర్మన్ చందుపట్ల రాజిరెడ్డి ఈ శిబిరాన్ని ఏర్పాటు చేయడంలో ముఖ్యపాత్ర వహించారు. రైతులు, హమాలీలు నిత్యం మట్టిలో, దుమ్ము ధూళిలో పనిచేయడం వల్ల కంటి సమస్యలకు గురవుతున్న విషయాన్ని గుర్తించి, వారి ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు తెలిపారు. శరత్ ఐ హాస్పిటల్‌కు చెందిన ప్రముఖ వైద్య బృందం శిబిరంలో పాల్గొని కంటి పరీక్షలు నిర్వహించింది. ఈ శిబిరంలో మొత్తం 120 మందికి పరీక్షలు నిర్వహించారు. వీరిలో ఐదుగురికి కంటిపై చెడు మాంసం ఉన్నట్లుగా గుర్తించారు. ఈ ఆపరేషన్లను ఆరోగ్యశ్రీ పథకం కింద ఉచితంగా చేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. అలాగే, ఆరుగురికి కంటి లోపలి శుక్లాలు ఉన్నట్లు గుర్తించారు. వీరికి అయ్యే ఆపరేషన్ ఖర్చులో తగిన రాయితీ కల్పించి చికిత్స చేస్తామని హాస్పిటల్ ప్రతినిధులు ప్రకటించారు. ఈ కార్యక్రమానికి కోఆర్డినేటర్లుగా ఇందూరి హంశల్, డీఓఏ మార్క, ఆంగోత్ జీవన్ వ్యవహరించారు. మార్కెట్ సిబ్బంది, రైతులు మరియు హమాలీలు పాల్గొని ఈ శిబిరాన్ని సద్వినియోగం చేసుకున్నారు.

# మహిళా పక్షపాతి రేవంత్ రెడ్డి

## ఏఎంసీ చైర్ పర్సన్ తౌటం ఝాన్సీ రాణి



**వరంగల్ వాయిస్, కమలాపూర్ :** మండలంలోని శనిగరం, కమలాపూర్, వంగపల్లి, ఉప్పల్, మర్రిపల్లి గూడెం గ్రామాలలో మంగళవారం ఇందిరమ్మ చీరల పంపిణీ కార్యక్రమాన్ని వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ తౌటం ఝాన్సీ రాణి రవీందర్ ఘనంగా ప్రారంభించారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఆడబిడ్డలు సగర్వంగా ధరించే విధంగా ఈ చీరలను పంపిణీ చేస్తోందని ఆమె పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఝాన్సీ రాణి రవీందర్ మాట్లాడుతూ తెలంగాణ ఆడబిడ్డలందరికీ పెద్దన్నగా భరోసా ఇస్తూ, ప్రతి పథకాన్ని ఆడబిడ్డలను దృష్టిలో పెట్టుకొని ప్రవేశపెడుతున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కొనియాడారు. మహిళా పక్షపాతిగా ఉన్న రేవంత్ రెడ్డిని, కన్నతల్లి లాంటి కాంగ్రెస్ పార్టీని మహిళా సోదరీమణులు ఆదరించి ఆశీర్వదించాలని ఆమె కోరారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలలో కాంగ్రెస్ అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించి, రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి వెన్నుదన్నుగా నిలవాలని ఝాన్సీ రాణి మహిళా ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు బాలసాని రమేష్ గౌడ్, మాజీ ఎంపీపీలు మాట్ల రమేష్, తడక శ్రీకాంత్, గుండపు చరణ్ పటేల్, పోడేటి బిక్షపతి, శ్రీకాంత్, నిగ్గుల లింగయ్య, గట్టు శ్రీధర్ గౌడ్, పుల్ల శోభన్, శనిగరపు రమేష్, కొండ రమేష్, మారేపల్లి సత్యపాల్, నాగరాజ్, ఆంకార్ అశోక్, కొండ తిరుపతి, వైనాల సాంబయ్య, గంధసిరి భిక్షపతి, చిలువేరు రవీందర్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# 30న వైబ్రేట్ అకాడమీ స్కాలర్‌షిప్ టెస్ట్

**వరంగల్ వాయిస్, హనుమకొండ:** స్థానిక వైబ్రేట్ అకాడమీ జూనియర్ కళాశాలల ఆధ్వర్యంలో ఈ నెల 30న స్కాలర్‌షిప్ కం ఎర్లీ అడ్మిషన్ టెస్ట్ నిర్వహించనున్నట్లు కళాశాల డైరెక్టర్ రాజేందర్ రెడ్డి తెలిపారు. ఈ పరీక్ష పోస్టర్‌ను ఆయన విడుదల చేశారు. నవంబర్ 30న ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ఐఐటీ–జేఈఈ & నీట్ కోచింగ్‌లో ప్రతిభావంతులైన విద్యార్థులను గుర్తించడానికి ఈ పరీక్ష నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ.. ఐఐటీ–జేఈఈ & నీట్ కోచింగ్‌లో దేశంలోనే అగ్రగామి విద్యాసంస్థ అయిన రాజస్థాన్ కోటా వైబ్రేట్ తరహా టాలెంట్ ఎగ్జామ్‌ను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ టాలెంట్ టెస్ట్ రాసిన విద్యార్థులలో అత్యుత్తమ ర్యాంకులు సాధించిన వారికి ఫీజులో 10 నుంచి 100 శాతం వరకు రాయితీ ఇవ్వడం జరుగుతుంది. ప్రతిభ కనబరిచిన విద్యార్థినీ విద్యార్థులకు బహుమతులు కూడా అందజేయబడతాయి. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని, తమ భవిష్యత్తుకు బలమైన పునాది వేసుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. స్కాలర్‌షిప్ టెస్ట్ వివరాల కోసం లేదా రిజిస్ట్రేషన్ కొరకు నక్కలగుట్ట మాంగల్య షాపింగ్ మాల్ వెనుక ఉన్న సెంట్రల్ ఆఫీస్‌లో గానీ, సెల్ నంబర్లు 9963017799, 7997979183లలో సంప్రదించవచ్చని వారు పేర్కొన్నారు.

# రోడ్డు ప్రమాదాల నివారణకు ఏసీపీ చొరవ

## కొత్తగట్టు సింగారం వద్ద 3డీ రేడియం స్టిక్కర్ల ఏర్పాటు




**వరంగల్ వాయిస్, శాయంపేట :** మండల పరిధిలోని కొత్తగట్టు సింగారం క్రాస్ రోడ్డు సమీపంలో ఇటీవల తరచుగా జరుగుతున్న రోడ్డు ప్రమాదాల దృష్ట్యా, వాటి నివారణకు పరకాల ఏసీపీ శ్రీ సతీష్ బాబు ప్రత్యేక చొరవ తీసుకున్నారు. ప్రమాదాలను అరికట్టే చర్యల్లో భాగంగా మంగళవారం రాత్రి సమయంలో (చీకటిలో) కూడా స్పష్టంగా కనిపించే విధంగా 3డీ రేడియం స్టిక్కర్లతో కూడిన బోర్డింగ్‌లు, కటౌట్‌లను కొత్తగట్టు సింగారం గ్రామ క్రాస్ రోడ్డు సమీపంలో ఏర్పాటు చేయడం జరిగింది. ఈ స్టిక్కర్లు డ్రైవర్లను అప్రమత్తం చేసి, వేగాన్ని నియంత్రించుకునేలా చేస్తాయని అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏసీపీ సతీష్ బాబుతో పాటు, శాయంపేట సీఐ పి.రంజిత్ రావు, శాయంపేట ఎస్సై జె.పరమేశ్వర్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# జాతీయ స్థాయి టెన్నికాయిట్ పోటీలకు తెలంగాణ జట్టు పయనం



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** నవంబర్ 26 నుంచి 30 వరకు జమ్మూ కాశ్మీర్‌లో జరగనున్న జాతీయ స్థాయి అండర్–17 బాల బాలికల (జూనియర్స్) టెన్నికాయిట్ పోటీలలో పాల్గొనేందుకు తెలంగాణ రాష్ట్ర క్రీడాకారులు సోమవారం హనుమకొండ జిల్లా కాజీపేట రైల్వే స్టేషన్ నుండి బయలుదేరి వెళ్లారు. ఈ సందర్భంగా క్రీడాకారులకు ఘనంగా వీడ్కోలు పలికి, పలువురు నాయకులు, సీనియర్ క్రీడాకారులు వారికి శుభాకాంక్షలు తెలిపారు. వరంగల్ జిల్లా టెన్నికాయిట్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి గోకారపు శ్యామ్ కుమార్, హనుమకొండ జిల్లా కార్యదర్శి అలువాల రాజకుమార్, కోశాధికారి జహూర్, జాతీయ క్రీడాకారుడు శివుడు, పీడీ శ్రీనివాస్, పీఈటీలు శ్రీధర్, సరిత, సురేష్, సీనియర్ క్రీడాకారుడు పున్నమి చందర్ తదితరులు పాల్గొన్నారు.

# మహిళలను కోటీశ్వరులను చేయడమే లక్ష్యం


■ ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు



**వరంగల్ వాయిస్, గణపురం:** రాష్ట్రంలోని కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయాలనే ధృడ సంకల్పంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వం పనిచేస్తోందని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు అన్నారు. సోమవారం సాయంత్రం భూపాలపల్లి నియోజకవర్గం గణపురం మండల కేంద్రంలో జిల్లా గ్రామీణ అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ఇందిరమ్మ చీరల పంపిణీ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై, మహిళలకు చీరలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు మాట్లాడుతూ మహిళల ఆర్థికాభివృద్ధి కోసం ప్రభుత్వం అనేక కార్యక్రమాలను అమలు చేస్తోందని తెలిపారు. మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం. అద్దె బస్సులకు మహిళలనే యజమానులను చేయడం. వడ్ల కొనుగోలు కేంద్రాల నిర్వహణ బాధ్యతలను మహిళలకు అప్పగించడం లాంటి ఎన్నో సంక్షేమ కార్యక్రమాలను ప్రభుత్వం అందిస్తోందని పేర్కొన్నారు. ఎమ్మెల్యే ఈరోజు మండలంలోని వివిధ అభివృద్ధి పనులను ప్రారంభించడంతో పాటు, సీఎంఆర్ఎఫ్ చెక్కులను కూడా లబ్ధిదారులకు అందజేశారు. మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన మొత్తం 13 మంది సీఎంఆర్ఎఫ్ లబ్ధిదారులకు రూ. 2,88,000 విలువైన చెక్కులను ఎమ్మెల్యే అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదల ఆరోగ్యానికి ఆర్థిక భరోసా సీఎం సహాయనిధి అని అన్నారు. బడుగు, బలహీన వర్గాల పేదల సంక్షేమమే ధ్యేయంగా సీఎం రేవంత్ రెడ్డి ప్రజా ప్రభుత్వం పనిచేస్తుందని తెలిపారు. కర్కపల్లి గ్రామంలో రూ.50 లక్షలతో ఆర్ అండ్ బీ రోడ్డు నుండి సబ్బిడికుంట వరకు నూతన రోడ్డును ప్రారంభించారు. రూ.50 లక్షలతో ఆర్ అండ్ బీ రోడ్డు నుంచి మామిళ్ల గడ్డ వరకు నూతన రోడ్డు ప్రారంభించారు. లక్ష్మారెడ్డిపల్లి గ్రామంలో మేకల మండి చుట్టూ రూ.30 లక్షలతో నూతనంగా నిర్మించిన ప్రహరీ గోడ, రూ.30 లక్షలతో సీసీ రోడ్డును, రూ.25 లక్షలతో నూతనంగా నిర్మించిన గ్రామ పంచాయతీ భవనాన్ని ప్రారంభించారు. అదేవిధంగా, గ్రామంలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని కూడా ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ కార్యక్రమాల్లో స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, పెద్ద సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

# షష్టి జాతర ప్రారంభం

- భక్తులు పాల్గొని విజయవంతం చేయాలి
- ఆలయ చైర్మన్ కొలుగూరి రాజేశ్వరరావు



**వరంగల్ వాయిస్, పరకాల:** పట్టణంలో దైవిక మహిమతో ప్రసిద్ధి చెందిన శ్రీ కుంకుమేశ్వర స్వామి ఆలయం ప్రతి సంవత్సరం జరిగే షష్టి జాతరకు సిద్ధమైంది. సాక్షాత్ పార్వతి దేవి తపస్సు ఫలితంగా ప్రతిష్ఠించిన దైవిక లింగంగా వెలసిన ఈ ఆలయం, జాతర సందర్భంగా భక్తుల రద్దీతో కళకళలాడనుంది. ఆలయ చైర్మన్ కొలుగూరి రాజేశ్వరరావు తెలిపిన వివరాల ప్రకారం మంగళవారం సాయంత్రంఆలయంలో స్వామివారికి పసుపుతో అభిషేకం చేసి, అష్టదిగ్బంధనం చేస్తారు. బుధవారం షష్టి బోనం ఊరేగింపుగా ఆలయానికి చేరుకుంటుంది. షష్టి బోనం స్వామివారి గర్భాలయంలో ప్రవేశించిన తర్వాత, అభిషేకం చేసిన పసుపు కాస్తా కుంకుమగా మారి కుంకుమేశ్వరుడిగా మారుతాడు. పిలిస్తే పలికే కుంకుమేశ్వరుడి మహిమలను భక్తులు కళ్లారా వీక్షించి, స్వామివారి కరుణాకటాక్షాలు పొందాలని చైర్మన్ కోరారు. ఈ ఏడాది జాతర కార్యక్రమాలను మరింత వైభవంగా నిర్వహించేందుకు ఆలయ కమిటీ ప్రత్యేక ఏర్పాట్లు చేపట్టింది. జాతర ఘట్టాలలో ప్రధానమైన షష్టి బోనంను బుధవారం సాయంత్రం 4 గంటలకు అయ్యగార్ల ఇంటి నుంచి మం గ ళ వా ద్యా లు , మహిళల పల్లకీ సేవలతో ఊరేగింపుగా ఆలయానికి తీసుకురానున్నట్లు ఆలయ వర్గాలు తెలిపాయి. భక్తులందరూ కుటుంబ సమేతంగా, సకాలంలో ఆలయ ప్రాంగణానికి చేరుకుని జాతర సంబరాలను దర్శించుకోవాలని చైర్మన్ రాజేశ్వరరావు విజ్ఞప్తి చేశారు. భక్తుల సౌకర్యార్థం ప్రత్యేక ఏర్పాట్లు పూర్తి చేసినట్టు కమిటీ సభ్యులు తెలిపారు. జాతర సందర్భంగా ప్రత్యేక దర్శనం, అన్న సమర్పణ కార్యక్రమాలు కూడా ఉండనున్నాయి. పరకాల, పరిసర ప్రాంతాల భక్తులు పెద్దఎత్తున పాల్గొని స్వామివారి కటాక్షం పొందాలని ఆలయ కమిటీ కోరింది. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలు డాక్టర్ సరోజన, కందుకూరి శ్రీధర్, తోట రవి, గోవింద సంధ్య, ప్రజాపత్ సవలారం, గౌరీశెట్టి నవీన్ లు పాల్గొన్నారు.



# విద్యార్థి ఎదుగుదలలో కౌమార దశ కీలకం

- లయన్ కుందూరు వెంకటరెడ్డి

**వరంగల్ వాయిస్, జనగామ :** విద్యార్థి ఎదుగుదలకు కౌమార దశ అత్యంత కీలకమని లయన్స్ ఇంటర్నేషనల్ మల్టిపుల్ కౌన్సిల్ కార్యదర్శి లయన్ కుందూరు వెంకటరెడ్డి అన్నారు. లయన్స్ క్లబ్ జనగామ ఆబాద్ ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు నిర్వహించిన లయన్స్ క్వెస్ట్ ఉపాధ్యాయ శిక్షణా శిబిరం ముగింపు కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. సోమవారం ఉదయం పూర్వ జిల్లా గవర్నర్ లయన్ కన్న పరశురాములు ప్రారంభించిన ఈ శిబిరంలో జనగామ పట్టణానికి చెందిన 9 పాఠశాలల నుంచి 22 మంది ఉపాధ్యాయులు పాల్గొన్నారు. నల్లగొండ నుంచి వచ్చిన మాస్టర్ ట్రైనర్ లయన్ కొండపల్లి రేణుక రెండు రోజుల పాటు శిక్షణ ఇచ్చారు. మంగళవారం సాయంత్రం ఏకశిల బీఈడీ కళాశాల ప్రాంగణంలో లయన్స్ క్వెస్ట్ జిల్లా చైర్మన్ లయన్ కనుగంటి సుభాష్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో శిక్షణ పొందిన టీచర్లు మాట్లాడుతూ, విద్యార్థులు భవిష్యత్తులో మంచి పౌరులుగా రాణించుటకు తీర్చిదిద్దే ప్రక్రియను లయన్స్ క్వెస్ట్ ద్వారా నేర్చుకున్నామని తెలిపారు. కౌమార దశలో విద్యార్థిని సత్సాంగత్యం వైపు ఆకర్షింపజేయగలిగితే లక్ష్యం నెరవేరినట్లేనని పలువురు ఉపాధ్యాయులు తమ స్పందన ద్వారా



తెలిపారు. విద్యార్థులను ఆకట్టుకునే క్రమంలో తాము అనేక కొత్త విషయాలు తెలుసుకున్నామని సంతృప్తిని వ్యక్తం చేశారు. ఈ రకంగా మాట్లాడిన వారిలో ప్రమోద్, రజిత, ప్రభాకర్, జోసెఫ్, శ్రీకాంత్, కృష్ణవేణి, భాగ్యలక్ష్మి, మహమ్మద్ సోలేహం, ఎం. కవిత, లుంబనాయక్ తదితరులు ఉన్నారు. సమావేశంలో పాల్గొన్న ఫస్ట్ వైస్ జిల్లా గవర్నర్ లయన్ ఎన్.సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులకు కావలసిన పాఠ్య పుస్తకాలు త్వరలో పంపిణీ చేస్తామని, అప్పటి వరకు క్లాసులు నిర్వహించుటకు ఉపాధ్యాయులు సిద్ధపడాలని కోరారు. ఈ కార్యక్రమంలో సెకండ్ వైస్ జిల్లా గవర్నర్ లయన్ పుట్ట హరికిషన్ రెడ్డి, ప్రోగ్రాం కోఆర్డినేటర్ లయన్ కె.రాజశేఖర్ రెడ్డి, జిల్లా జీఎస్టీ కోఆర్డినేటర్ రేవూరి రమణారెడ్డి, క్లబ్ కార్యదర్శి పి.సురేశ్ కుమార్, కోశాధికారి లయన్ సుదగాని ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా ఏఎమ్మార్ వార్షికోత్సవం




**వరంగల్ వాయిస్, మల్హర్:** మండలంలోని తాడిచెర్ల ఓపెన్ కాస్ట్ బొగ్గు తవ్వకాల సంస్థ ఏఎమ్మార్ తమ ఎనిమిదో వార్షికోత్సవ వేడుకలను మంగళవారం తాడిచెర్ల ఓసీపీ ఆవరణలో ఘనంగా నిర్వహించింది. ఏఎమ్మార్ కంపెనీ ఎండీ మహేశ్వర్ రెడ్డీ ఆదేశాల మేరకు జరిగిన ఈ వేడుకల్లో, గత పదిహేను రోజులుగా కార్మికులకు నిర్వహించిన క్రీడా పోటీల విజేతలకు మరియు ఉత్తమ ఉద్యోగులకు బహుమతులు, ప్రశంసా పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏఎమ్మార్ వైస్ ప్రెసిడెంట్ ప్రభాకర్ రెడ్డి మరియు సీనియర్ జనరల్ మేనేజర్ కేఎస్ఎన్ మూర్తి లు పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ కార్మికుల అంకితభావమే సంస్థ పురోగతికి పునాది అని కొనియాడారు. ప్రతి కార్మికుడు సంస్థ అభివృద్ధికి నిరంతరం కృషి చేయాలని కోరారు. ఉత్తమ సేవలు అందించిన ఉద్యోగులను ఈ సందర్భంగా ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో ఏఎమ్మార్ వైస్ ప్రెసిడెంట్ ప్రభాకర్ రెడ్డి, వైస్ ప్రెసిడెంట్ కేఎస్ఎన్ మూర్తి, మైన్ మేనేజర్ శ్రీనివాస్, సేఫ్టీ ఆఫీసర్ సురేష్ బాబు, ఫిట్ ఇంజనీర్ కిషన్, వెల్ఫేర్ ఆఫీసర్ రమేష్ బాబు, ఏఎమ్మార్ అధికారులు విశ్వప్రసాద్, సర్వోత్తమ్, హెచ్ఆర్ డీజీఎం రమేష్ బాబు, సూపర్వైజర్ బొబ్బిలి నరేష్ తో పాటు ఉద్యోగులు, కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# మామునూర్ సీఐగా శ్రీనివాస్ యాదవ్ బాధ్యతల స్వీకరణ




**వరంగల్ వాయిస్, క్రైమ్:** వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో ఇటీవల జరిగిన ఇన్‌స్పెక్టర్ల బదిలీల్లో భాగంగా మామునూర్ నూతన ఇన్‌స్పెక్టర్‌గా ఎలబోయిన శ్రీనివాస్ యాదవ్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ యాదవ్ జనగామ టౌన్, రఘునాథపల్లి, ఐటీ సెల్ విభాగాల్లో పని చేశారు. ఇక్కడ పనిచేసిన మాజీ ఇన్‌స్పెక్టర్ ఓ.రమేష్ వీఆర్‌కు (రిజర్వ్) బదిలీపై వెళ్లారు. ఈ సందర్భంగా నూతన ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ యాదవ్‌కు పోలీస్ సిబ్బంది, పలువురు ప్రముఖులు, స్థానికులు శుభాకాంక్షలు తెలిపారు.

# డోర్నకల్‌లో మహిళా శక్తి చీరల పంపిణీ



**వరంగల్ వాయిస్, డోర్నకల్:** మండల కేంద్రంలోని ఆజరయ్య ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన ఇందిరా మహిళా శక్తి చీరల పంపిణీ కార్యక్రమంలో ప్రభుత్వం విప్, డోర్నకల్ ఎమ్మెల్యే డా.జాటోత్ రామచంద్రనాయక్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రామచంద్రనాయక్ మాట్లాడుతూ మహిళలు కేవలం కుటుంబానికి ఆధారం మాత్రమే కాదని, సమాజ అభివృద్ధికి దారిచూపే శక్తి అని పేర్కొన్నారు. రాష్ట్ర అభివృద్ధి అనేది మహిళల ఆర్థిక ఎదుగుదలపైనే ఆధారపడి ఉంటుందని ఆయన స్పష్టం చేశారు. ఇందిరమ్మ రాజ్యంలో మహిళల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారు రాష్ట్రంలోని కోటి మంది మహిళలకు చీరలు అందించడం మహిళల పట్ల ప్రభుత్వానికి ఉన్న నిబద్ధతకు నిదర్శనమని తెలిపారు. "ఆడబిడ్డలకు ఒక అన్నలా, తండ్రిలా చీరలు అందించడం నాకు గొప్ప భాగ్యం" అని ఎమ్మెల్యే రామచంద్రనాయక్ అభిప్రాయపడ్డారు. మహిళలు ఆర్థికంగా బలపడేందుకు, పారిశ్రామిక రంగంలో ముందుకు రావడానికి ప్రభుత్వం అనేక అవకాశాలు కల్పిస్తోందని చెప్పారు. ప్రతి రంగంలో మహిళలు భాగస్వాములు కావాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా, మండల నాయకులు, మాజీ ప్రజా ప్రతినిధులు, అధికారులు, పార్టీ కార్యకర్తలు, మహిళా సంఘాల సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# పెండింగ్ చలాన్ల చెల్లింపుపై నిర్లక్ష్యం వద్దు

**దామెర ఎస్సై కొంక అశోక్**

**జాతీయ రహదారి 163పై వాహన తనిఖీలు**



**వరంగల్ వాయిస్, దామెర:** హనుమకొండ జిల్లా దామెర పోలీస్ స్టేషన్ పరిధిలోని 163వ నంబర్ జాతీయ రహదారిపై గల దామెర క్రాస్ రోడ్ వద్ద ఎస్సై కొంక అశోక్ ఆధ్వర్యంలో మంగళవారం వాహన తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీలలో భాగంగా పలు వాహనాలకు సంబంధించిన పత్రాలను పోలీసులు క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా పలు వాహనాలపై పెండింగ్‌లో ఉన్న ట్రాఫిక్ ఉల్లంఘన చలాన్‌లను అక్కడికక్కడే వాహనదారుల చేత కట్టించారు. ఎస్సై కొంక అశోక్ మాట్లాడుతూ వాహనదారులందరూ రహదారి నియమాలను కచ్చితంగా పాటించాలని సూచించారు. ద్విచక్రవాహనదారులు హెల్మెట్‌ను విధిగా ధరించాలని సూచించారు. వాహనదారులు తమ వాహనాలపై పెండింగ్‌లో ఉన్న ట్రాఫిక్ ఉల్లంఘన చలాన్లను వెంటనే చెల్లించి పోలీసులకు సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ తనిఖీలలో ఎస్సై వెంట హెడ్ కానిస్టేబుల్ రాము, కానిస్టేబుల్స్ రమేష్, శ్రీనివాస్, ప్రణయ్, హోంగార్డులు అనిల్, కుమార్ లు పాల్గొన్నారు.

# సీఎస్‌సీ హెల్త్ టెస్టులు రద్దు చేయాలి

◆ జీవో 12 సవరించాలి
◆ ప్రభుత్వాన్ని డిమాండ్ చేసిన బీసీడబ్ల్యూయూ




**వరంగల్ వాయిస్, జనగామ:** భవన నిర్మాణ కార్మికులకు అన్యాయం చేసే విధంగా ప్రైవేట్ ఇన్సూరెన్స్ కంపెనీలకు సంక్షేమ పథకాలను అప్పగిస్తూ జారీ చేసిన జీవో నెం.12ను సవరించాలని, అలాగే సీఎస్‌సీ హెల్త్ టెస్టులను తక్షణమే రద్దు చేయాలని బిల్డింగ్ అండ్ అదర్ కన్‌స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ (బీసీడబ్ల్యూయూ) జనగామ జిల్లా ప్రధాన కార్యదర్శి సుంచు విజేందర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం కార్మిక సంఘాల ఆధ్వర్యంలో జనగామ జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాకు బీసీడబ్ల్యూయూ జిల్లా అధ్యక్షులు జోగు ప్రకాష్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన కార్యదర్శి సుంచు విజేందర్ మరియు బీఎన్‌ఆర్‌కేఎస్ జిల్లా అధ్యక్షులు యాదగిరి లు మాట్లాడుతూ సంక్షేమ పథకాలు భవన కార్మికుల వెల్ఫేర్ బోర్డు నుండే నేరుగా అందించాలని డిమాండ్ చేశారు. సహజ మరణానికి ఇచ్చే మొత్తాన్ని రూ.5 లక్షలకు పెంచాలని కోరారు. తెలంగాణ భవన, ఇతర నిర్మాణ కార్మిక సంక్షేమ బోర్డు అమలు చేస్తున్న ప్రమాద మరణం (రూ.10 లక్షలు), సహజ మరణం (రూ.2 లక్షలు), శాశ్వత, పాక్షిక అంగవైకల్యం వంటి నాలుగు స్కీములను ప్రైవేట్ ఇన్సూరెన్స్ కంపెనీల ద్వారా అమలు చేయాలంటూ రాష్ట్ర ప్రభుత్వం జూలై 22న జీవో నెం.12 విడుదల చేయడం అన్యాయమని పేర్కొన్నారు. నాయకులు మాట్లాడుతూ జీవో విడుదలైన రెండు రోజులకే ప్రైవేట్ బీమా కంపెనీలైన క్రెడిట్ యాక్సిస్ లైఫ్ ఇన్సూరెన్స్ కంపెనీకి రూ.250 కోట్లు, ఎర్గో జనరల్ ఇన్సూరెన్స్ కంపెనీకి రూ.94 కోట్లు, ట్రెయిల్ బ్లేజర్ అనే బ్రోకర్స్ సంస్థ ద్వారా మొత్తం రూ.346 కోట్లు అక్రమంగా బదిలీ చేశారని ఆరోపించారు. 1996 భవన నిర్మాణ కార్మికుల కేంద్ర చట్టం ప్రకారం వెల్ఫేర్ బోర్డు అడ్వైజరీ కమిటీని నియమించి, వారి నిర్ణయం ప్రకారమే నిధులు ఖర్చు చేయాలని, కానీ ప్రభుత్వం కమిటీని నియమించకుండా గుర్తింపు లేని ఇన్సూరెన్స్ కంపెనీలకు స్కీములను అప్పగించి కార్మికుల నోట్లో మట్టి కొట్టిందని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా 2009 నుంచి 2025 వరకు బోర్డులో నమోదు చేసుకున్న 28 లక్షల మంది కార్మికులలో కేవలం 15 లక్షల మందిని మాత్రమే రెన్యువల్ చేసి, ఒక్కొక్క కార్మికుడికి రూ. 2,309 చొప్పున మొత్తం రూ. 346.36 కోట్లు ప్రైవేట్ బీమా కంపెనీలకు కట్టబెట్టారని మండిపడ్డారు. సుమారు 13 లక్షల మంది కార్మికుల కార్డులు రెన్యువల్ చేయకుండా వారికి అన్యాయం చేస్తున్నారని పేర్కొన్నారు. ప్రస్తుతం బోర్డు అమలు చేస్తున్న 12 రకాల స్కీముల్లో 4 మాత్రమే ఇన్సూరెన్స్ కంపెనీలకు ఇచ్చి, మిగతా 8 స్కీములు (వివాహ కానుక, ప్రసూతి కానుక, హాస్పిటల్ ఖర్చులు, దహన సంస్కారాల ఖర్చులు వంటివి) కార్మికులకు అందకుండా చేస్తున్నారని తెలిపారు. అలాగే, హెల్త్ టెస్టుల పేరుతో సీఎస్‌సీ సంస్థకు రూ. 463 కోట్లు దోచిపెట్టారని ఆరోపించారు. అనంతరం వివిధ డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని వారు లేబర్ ఆఫీసర్ కుమారస్వామికి అందజేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి బూడిద ప్రశాంత్, బీసీడబ్ల్యూయూ జిల్లా కోశాధికారి సంపత్, జిల్లా సహాయ కార్యదర్శి గంగరబోయిన మల్లేష్ రాజ్, ఉపాధ్యక్షులు కచ్చిగల వెంకటేష్, మధు, పాలమాకుల నరసింహ, దామెర సామ్ సోన్, సురేష్, ఎల్ల స్వామి, కృష్ణ, సుధాకర్, సైదులు, యాకన్న, నరసింహులు, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

# గర్భిణీలకు ఆరోగ్య అవగాహన సదస్సు



**వరంగల్ వాయిస్, హనుమకొండ:** శ్రీ రామకృష్ణ సేవ సమితి, ఆర్య జనని ట్రస్ట్ సంయుక్త ఆధ్వర్యంలో హనుమకొండలోని అంబేద్కర్ భవన్‌లో మంగళవారం గర్భిణీ స్త్రీల అవగాహన సదస్సు ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో వరంగల్ పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి సతీమణి నాయిని నీలిమ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. కార్యక్రమాన్ని జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించిన అనంతరం, ముఖ్య అతిథులు నాయిని విశాల్ రెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా నాయిని నీలిమ రెడ్డి మాట్లాడుతూ రామకృష్ణ సేవ సమితి ఇంతటి మహత్తర కార్యక్రమాన్ని నిర్వహించడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. గర్భిణీ స్త్రీలకు నవమాసాలు రానున్న తరానికి నాంది లాంటివని పేర్కొన్నారు. పుట్టినప్పటి నుంచి పిల్లలను ఉత్తమ అలవాట్లు, క్రమశిక్షణ, మంచి ఆలోచన విధానాలను అవలంబించేలా చూసుకోవాలని సూచించారు. గర్భధారణ సమయంలో తొమ్మిది నెలలు ప్రతి రోజు ఆరోగ్యవంతమైన ఆహారాన్ని తీసుకోవాలని, ప్రతి గంటకు ఒకసారి గ్లాస్ వాటర్ తీసుకునేలా చూసుకోవాలని తెలిపారు. నేడు తమ కుమారుడు నాయిని విశాల్ రెడ్డి గారి 10వ వర్ధంతి కావడం వల్ల మీ అందరిలో ఆయన జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నానని చెప్పారు. ఈ కార్యక్రమంలో రామకృష్ణ సేవ సమితి ప్రతినిధులు, ఆర్య జనని ట్రస్ట్ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ చీరల పంపిణీ



**వరంగల్ వాయిస్, దామెర:** మండలంలోని దుర్గం పేట గ్రామంలో ఇందిరమ్మ చీరల పంపిణీ కార్యక్రమం ఘనంగా జరిగింది. మహిళల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని కాంగ్రెస్ ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని చేపట్టింది. ఈ కార్యక్రమంలో సమన్వయ కమిటీ సభ్యులు కూనమల్ల రవీందర్, గ్రామ కమిటీ అధ్యక్షులు దాసి శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు. ఇందిరమ్మ కమిటీ సభ్యులు పుచ్చకాయల లింగారెడ్డి, గజ్జల కరుణాకర్, గడ్డం సదానందం, కడెం రవి, గండు సమ్మయ్య, గడ్డం రమేష్, పుచ్చకాయల మల్లారెడ్డి, రాఖి, సంతోష్, గడ్డం కార్తీక్, కూనమల్ల దశరథం, పంచాయతీ కార్యదర్శి సుకన్య, క్లస్టర్ కోఆర్డినేటర్ మాధవి, సీఏ సలేంద్ర కల్పన, మహిళా సంఘాల అధ్యక్షులు, సభ్యులు అధిక సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# పోగొట్టుకున్న మొబైల్ ఫోన్లు బాధితులకు అందజేత



**వరంగల్ వాయిస్, చిట్యాల :** మండలంలోని అందుకుతండ గ్రామానికి చెందిన ఇద్దరు వ్యక్తులు పోగొట్టుకున్న రెండు మొబైల్ ఫోన్లను చిట్యాల పోలీసులు రికవరీ చేసి, మంగళవారం బాధితులకు తిరిగి అందజేశారు. అందుకుతండ గ్రామానికి చెందిన గోపాల్, గద్దర్ అనే వ్యక్తులు సుమారు రెండు నెలల క్రితం మార్గమధ్యంలో తమ ఒప్పో, మోటో మొబైల్ ఫోన్లను పోగొట్టుకున్నారు. బాధితులు వెంటనే చిట్యాల పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, చిట్యాల ఎస్సై ఆదేశాల మేరకు కానిస్టేబుల్ లాల్ సింగ్ ఆ మొబైల్ ఫోన్ల వివరాలను సీఈఐఆర్ పోర్టల్‌లో నమోదు చేశారు. పోలీసులు నేడు ఆ ఫోన్లను గుర్తించి, చిట్యాల సర్కిల్ ఇన్‌స్పెక్టర్ మల్లేష్ బాధితులకు తిరిగి అందజేశారు. పోగొట్టుకున్న తమ మొబైల్ ఫోన్లను తిరిగి ఇప్పించినందుకు బాధితులు చిట్యాల సీఐకి, పోలీస్ సిబ్బందికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

# ఒకే స్కూల్‌కు రెండు పేర్లా?



◆ చర్యలు తీసుకోకపోవడంలో ఆంతర్యమేమిటి?
◆ జిల్లా అధికారులను నిలదీసిన విద్యార్థి సంఘాలు

వరంగల్ వాయిస్, హనుమకొండ: జిల్లా కేంద్రంలోని రెడ్డి కాలనీలో 'వికాస్ స్కూల్' పేరిట పర్మిషన్ తీసుకుని, 'మాస్టర్ జి స్కూల్' పేరుతో పాఠశాలను కొనసాగిస్తున్నట్లు స్పష్టమైన ఆధారాలు చూపించినప్పటికీ, జిల్లా విద్యాశాఖ అధికారులు చర్యలు తీసుకోవడం లేదంటూ వామపక్ష విద్యార్థి సంఘాల ఐక్య కార్యాచరణ కమిటీ (జేఏసీ) నాయకులు జిల్లా అధికార యంత్రాంగాన్ని ప్రశ్నించారు. చర్యలు తీసుకోకపోవడానికి గల ఆంతర్యం ఏమిటని వారు నిలదీశారు. బుధవారం హన్మకొండ కలెక్టరేట్ కార్యాలయంలోని ఇంచార్జి జిల్లా విద్యాశాఖ అధికారి, మండల విద్యాశాఖ అధికారులను విద్యార్థి సంఘాల ప్రతినిధులు కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనలను ఉల్లంఘిస్తూ కొనసాగిస్తున్న 'మాస్టర్ జి స్కూల్'ను తక్షణమే మూసివేయాలి. విద్యార్థుల విద్యా సంవత్సరం నష్టపోకుండా వారిని వేరే స్కూలుకు షిఫ్ట్ చేయాలి. విద్యార్థుల వద్ద వసూలు చేసిన అన్ని రకాల ఫీజులను తక్షణమే తల్లిదండ్రులకు తిరిగి ఇప్పించాలి. 'మాస్టర్ జి' పేరుతో ఎలాంటి పర్మిషన్ లేకున్నా, విద్యార్థులను, తల్లిదండ్రులను మోసం చేస్తూ స్కూల్ నడుపుతున్న యాజమాన్యంపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో వామపక్ష విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళనలు కొనసాగిస్తామని విద్యాశాఖ అధికారులను, రాష్ట్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు. పీడీఎస్‌యూ నాయకులు మొగిలి వెంకటరెడ్డి, బి.నరసింహారావు, డానియల్, ఏఐఎఫ్‌డీఎస్ నాయకులు గడ్డం నాగార్జున, ఏఐఎస్‌ఎఫ్ నాయకులు భాష బోయిన సంతోష్, ప్రణీత్, ఎస్ఎఫ్ఐ నాయకులు మంద శ్రీకాంత్, జస్వంత్ పాల్గొన్నారు.

# ప్రజలకు నాణ్యమైన ఆరోగ్య సేవలు అందించాలి

◆ డీఎంహెచ్‌ఓ డాక్టర్ సాంబశివరావు



**వరంగల్ వాయిస్, పర్వతగిరి :** జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ బి.సాంబశివరావు మంగళవారం వరంగల్ జిల్లాలోని నెక్కొండ, పర్వతగిరి మండలాల్లోని ప్రభుత్వ ఆరోగ్య కార్యక్రమాలను పర్యవేక్షించి, సిబ్బందికి తగిన సూచనలు చేశారు. ఆయన తొలుత నెక్కొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని ఎంపీపీ స్కూలులో నిర్వహిస్తున్న 'కిశోర రక్ష' కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. ఈ కార్యక్రమం ద్వారా ప్రతి విద్యార్థినీ విద్యార్థికి హెల్త్ స్క్రీనింగ్ చేసి, వారిలో ఉన్న ఆరోగ్య సమస్యలకు తగిన పరీక్షలు, చికిత్సలు అందించడం జరుగుతుందని తెలిపారు. పాఠశాలలోని ఉపాధ్యాయులు విద్యార్థులలో ఉన్న సమస్యలను గుర్తించి, వైద్య ఆరోగ్యశాఖ సిబ్బందికి సూచించాలని కోరారు. విద్యార్థినీ విద్యార్థులు తమ శారీరక, మానసిక సమస్యలను వైద్య అధికారులకు వివరించి, తగిన చికిత్సలు చేయించుకోవాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం, పర్వతగిరిలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నిర్వహిస్తున్న 'ఆరోగ్య మహిళ' క్లినిక్‌ను సందర్శించి, అందుతున్న సేవలను తెలుసుకుని తగు సూచనలు చేశారు. ప్రతి స్త్రీ ఉచితంగా అన్ని రకాల పరీక్షలు చేయించుకొని, తగిన చికిత్సలు తీసుకొని ఆరోగ్యంగా ఉండాలని వారిని కోరారు. ఆరోగ్య మహిళా క్లినిక్‌ల ద్వారా వారిలో ఉన్న ఆరోగ్య సమస్యలను తెలుసుకోవడానికి రక్తం శాంపిల్స్ సేకరించి, నర్సంపేటలోని తెలంగాణ హబ్ ద్వారా తగిన పరీక్షలు చేసి, వచ్చిన రిపోర్ట్స్ ఆధారంగా చికిత్సలు అందిస్తున్నామని తెలిపారు. ప్రతి మహిళ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని ఆరోగ్యంగా ఉండడానికి కృషి చేయాలని ఆయన కోరారు. వైద్య ఆరోగ్యశాఖ సిబ్బందికి డీఎంహెచ్‌ఓ స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ఆశా కార్యకర్త నుండి వైద్యాధికారి వరకు నిరంతరము ప్రజల అవసరాల నిమిత్తము ఆరోగ్య సేవలు అందించాలని ఆదేశించారు. ప్రభుత్వము నిర్దేశించిన లక్ష్యాలను చేరుకోవాలని ఆదేశించడం జరిగింది. విధి నిర్వహణలో ఎవరు కూడా తమ ఉద్యోగ ధర్మాన్ని నిర్లక్ష్యం చేస్తే వారిపై చర్యలు ఉంటాయని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ప్రాథమిక వైద్యాధికారులు, సీసీ నాగరాజు, సిబ్బంది మరియు స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

# 28న నెట్‌ఫ్లిక్స్‌లో మాస్ జాతర

మాస్ మహారాజా రవితేజ హీరోగా నటించిన 75వ చిత్రం 'మాస్ జాతర'. యంగ్ బ్యూటీ శ్రీలీల హీరోయిన్ గా కనిపించిన ఈ సినిమాకు భాను భోగవరపు దర్శకత్వం వహించాడు. అక్టోబరు 31న ప్రీమియర్స్ తో వరల్డ్ వైడ్ గా రిలీజ్ అయింది. కానీ ప్రీమియర్ షో నుండే ఈ సినిమా ఫ్లాప్ టాక్ తెచ్చుకుంది. రొటీన్ రెగ్యులర్ కథ, బోరింగ్ స్క్రీన్ ప్లేతో ఆడియెన్స్ కు విసుగుతెప్పించాడు దర్శకుడు. రాజేంద్ర ప్రసాద్ క్రింజ్ కామెడి నవ్వుతెప్పించకపోగా విసిగించింది. కనీసం మినిమం వసూళ్లు కూడా రాబట్టలేక రవితేజ కెరీర్ లో మరో డిజాస్టర్ గా మిగిలింది. రిలీజ్ కు ముందే మాస్ జాతర డిజిటల్ రైట్స్ ను నెట్ ఫ్లిక్స్ భారీ ధరకు కొనుగోలు చేసింది. థియేటర్ లో ఫ్లాప్ అయినా ఈ సినిమా ఓటీటీ రిలీజ్ డేట్ ఫిక్స్ చేసుకుంది. ఈ నెల 28 నుండి నెట్ ఫ్లిక్స్ ఈ సినిమాను స్ట్రీమింగ్ కు తీసుకురాబోతుంది. తెలుగు, తమిళ్, మలయాళం, కన్నడ భాషలలో ఈ సినిమాను స్ట్రీమింగ్ తీసుకువస్తుంది నెట్ ఫ్లిక్స్. థియేటర్ లో రిలీజ్ అయిన 28 రోజుల తర్వాత మాస్ జాతర ను స్ట్రీమింగ్ చేస్తుంది నెట్ ఫ్లిక్స్.








## కొట్టిపడేసిన హీరో రామ్


ఎనర్జిటిక్ స్టార్ రామ్ పోతినేని హీరోగా భాగ్యశ్రీ హీరోయిన్ జంటగా వస్తున్న మూవీ ఆంధ్రాకింగ్ తాలూకా నవంబర్ 27న రిలీజ్ కాబోతోంది. అయితే ఈ సినిమా మొదలైనప్పటి నుంచి రామ్, భాగ్య శ్రీ డేటింగ్ లో ఉన్నారంటూ ఓ రేంజ్ లో రూమర్లు వస్తున్నాయి. ఇద్దరూ ప్రైవేట్ గా కలుసుకుంటున్నారని.. విదేశాలకు టూర్లకు వెళ్తున్నారంటూ రకరకాల రూమర్లు వస్తూనే ఉన్నాయి. ఇక మూవీ రిలీజ్ డేట్ దగ్గర పడుతుండటం తో వరుస ప్రమోషన్లు చేస్తున్నారు. ఇందులో భాగంగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న రామ్.. దీనిపై క్లారిటీ ఇచ్చారు. డేటింగ్ రూమర్లు అన్నీ ఫేక్ అంటూ కొట్టి పారేశాడు. భాగ్య శ్రీ తనకు మంచి ఫ్రెండ్ అని క్లారిటీ ఇచ్చాడు. ఈ సినిమా కోసం నేను స్వయంగా ఓ లవ్ సాంగ్ రాశాను. అప్పటి నుంచి మా ఇద్దరి మధ్య ఏదో ఉందని అంతా అనుకుంటున్నారు. భాగ్య శ్రీపై ఇంట్రెస్ట్ లేకుండా ఇంత మంచి సాంగ్ రాయడు కదా అని అంతా అనుకుంటున్నారు. కానీ భాగ్యశ్రీని మా సినిమా కోసం తీసుకోక ముందే ఆ పాట రాశాను. సినిమాలోని హీరో, హీరోయిన్ పాత్రల మధ్య అంత మంచి బాండిరగ్ ఉంటుంది కాబట్టే ఆ పాట బాగా వచ్చింది. అంతకు మించి మా మధ్య ఏమీ లేదు. భాగ్య శ్రీ మంచి యాక్టర్ అంటూ చెప్పాడు రామ్. భాగ్య శ్రీ కూడా ఇదే విషయంపై స్పందిస్తూ.. రామ్ తనకు మంచి ఫ్రెండ్ మాత్రమే అని తెలిపింది.

## అంతా ఉత్తిదే



# హేమ డెలివరీ కోసం ఆస్పత్రిని బుక్ చేసాడు

బాలీవుడ్ దిగ్గజ నటుడు ధర్మేంద్ర, ఆరు దశాబ్దాలపాటు బాలీవుడ్‌కు ఎన్నో చిరస్మరణీయ చిత్రాలను అందించారు. ఆయన మరణవార్తతో సినీలోకం తీవ్ర విషాదంలో మునిగిపోయింది. డ్రీమ్ గర్ల్ హేమమాలిని తో ప్రేమ, పెళ్లి వ్యవహారం ప్రస్తుతం తీవ్ర చర్చనీయాంశమవుతోంది. 19 ఏళ్ల వయసులోనే ధర్మేంద్ర.. ప్రకాష్ కౌర్ అనే మహిళను వివాహం చేసుకున్న విషయం తెలిసిందే. ఈ దంపతులకు నలుగురు పిల్లలు ఉన్నారు. ఇక 1970లో 'డ్రీమ్ గర్ల్' హేమమాలినితో కలిసి చేసిన సినిమాల సమయంలో వీరిద్దరి మధ్య సాన్నిహిత్యం పెరిగి ప్రేమగా మారింది. 1980లో వీరు వివాహ బంధంతో ఒక్కటయ్యారు. ధర్మేంద్ర ఇస్లాం మతం స్వీకరించి, దిలావర్ ఖాన్ పేరుతో హేమ మాలినిని వివాహం చేసుకున్నట్లు పెద్ద ఎత్తున పుకార్లు వచ్చాయి. హేమమాలిని అంటే ధర్మేంద్రకు అంతగా పిచ్చి. ఇక 1981లో హేమ మాలిని తొలి బిడ్డకు జన్మనిచ్చింది. ఆ సమయంలో ధర్మేంద్ర చేసిన ఓ పనికి అందరూ షాక్ అయ్యారు. హేమమాలిని డెలివరీ టైమ్ దగ్గరపడుతున్న సమయంలో.. ఆమె కోసం ఏదైనా సమ్‌థింగ్ స్పెషల్‌గా చేయాలని భావించారు ఈ దిగ్గజ నటుడు. బిడ్డను కనే సమయంలో హేమ మాలినికి సౌకర్యంగా, గోప్యతకు భంగం కలగకుండా ఉండేందుకు మొత్తం నర్సింగ్ హోమ్‌నే బుక్ చేశాడు. నర్సింగ్ హోమ్‌లో ఉన్న 100 రూమ్‌లను బుక్ చేసినట్లు హేమ సన్నిహితురాలు నీతు ద్వారా వెలుగులోకి వచ్చింది. 'హేమ గర్భవతి అని ఎవరికీ తెలియదు. ఆ సమయంలో ఆమె గోప్యతకు భంగం కలగకుండా ఉండేందుకు ధరమ్ జీ ఆసుపత్రిలోని అన్ని గదులను బుక్ చేశాడు' అని నీతు ఓ సందర్భంలో గుర్తు చేసుకుంది. హేమ `ధర్మేంద్ర జంటకు ఇద్దరు కుమార్తెలు. తొలుత ఇషా డియోల్ జన్మించిన విషయం తెలిసిందే. ఆ తర్వాత ఆహాన డియోల్ జన్మించారు. ప్రకాశ్ కౌర్ `ధర్మేంద్ర జంటకు ఇద్దరు కుమారులు సన్నీ డియోల్, బాబీ డియోల్ ఉండగా, వారితో పాటు కుమార్తెలు విజేత, అజిత ఉన్నారు. ఇలా మొత్తం ఆరుగురు పిల్లలకు ధర్మేంద్ర తండ్రి అయ్యారు.



# వారణాసి లెవల్లో ఎన్టీఆర్- నీల్ మూవీ ప్రమోషన్ ?



వారణాసి మూవీ టైటిల్‌ను భారీ ఈవెంట్ ద్వారా ప్రకటించిన విషయం తెలిసిందే. భారతీయ సినిమా ప్రమోషన్స్‌కు ఇది కొత్త నిర్వచనంగా మారింది. ఈ వినూత్న ప్రయత్నం దేశవ్యాప్తంగా మాత్రమే కాదు, హాలీవుడ్ మీడియా దృష్టిని కూడా ఆకర్షించి గ్లోబల్ లెవెల్‌లో పెద్ద చర్చగా మారింది. సాధారణంగా టైటిల్స్‌ను పోస్టర్, గ్లింప్స్ లేదా సోషల్ మీడియా పోస్టుల ద్వారా ప్రకటిస్తారు. కానీ వారాణాసి యూనిట్ మాత్రం పాత్రలు, కథ, థీమ్ వివరించే క్రమంలో స్టేజ్ ఈవెంట్ ఏర్పాటు చేసి ప్రమోషన్‌లో కొత్త మైలురాయి సృష్టించింది. దీనికి మంచి రెస్పాన్స్ రావడంతో ఇప్పుడు ఇదే స్ట్రాటజీని ఎన్టీఆర్ `ప్రశాంత్ నీల్ కాంబోలో రూపొందుతున్న సినిమాకి ఉపయోగించనున్నట్టు తెలుస్తోంది. ఎన్టీఆర్ `ప్రశాంత్ నీల్ మూవీ టైటిల్‌పై భారీ ఆసక్తి నెలకొనగా, మూవీకి డ్రాగన్ అనే పేరు ఖరారు చేసినట్టు టాక్ వినిపిస్తుంది. అయితే డ్రాగన్' పేరు ఇంకా నిర్ధారణ కాలేదని మైత్రి మూవీ మేకర్స్ ప్రొడ్యూసర్ రవి శంకర్ స్పష్టం చేశారు. 'డ్రాగన్ కూడా ఓ ఆప్షన్ మాత్రమే. అధికారికంగా ఏ టైటిల్ ఫైనల్ కాలేదు. ఇది పూర్తిగా అంతర్జాతీయ స్థాయిలో తెరకెక్కుతున్న భారీ ప్రాజెక్ట్. ప్రశాంత్ నీల్ విజన్‌లో ఎన్టీఆర్ కొత్త అవతరం చూపించ బోతున్నాడు. టైటిల్, ఫస్ట్ గ్లింప్స్ వారణాసి మాదిరిగానే ప్రాజెక్ట్‌కి తగ్గ స్థాయిలో గ్రాండ్‌గా రిలీజ్ చేస్తామని తెలిపారు. ఫిల్మ్ ప్రమోషన్‌లో భారీ ఈవెంట్ మోడల్ ఎన్నో ప్రయోజనాలను కలిగిస్తోంది. సినిమా థీమ్‌ను స్పష్టంగా ప్రేక్షకులకు చెప్పే అవకాశం కలుగుతుంది. ఇలా చేస్తే గ్లోబల్ ఆడియన్స్‌ను చేరుకునే అవకాశం ఉంటుంది. హాలీవుడ్ మీడియా సహా విదేశీ ప్రెస్ అటెన్షన్, తక్కువ సమయంలో భారీ బజ్ క్రియేట్ చేయగలగడం, కంటెంట్‌పై తప్పుదారులు వెళ్లకుండా క్లారిటీ ఇవ్వడం కొత్త ట్రెండ్‌ను ఆమోదించేలా చేశాయి.



# రైతు డిక్లరేషన్ పేరుతో కాంగ్రెస్ మోసం

- నిండా ముంచుతున్న సర్కార్
- బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర అధ్యక్షులు బస్వాపురం లక్ష్మీ నర్సయ్య

**వరంగల్ వాయిస్, హనుమకొండ :** రైతు డిక్లరేషన్ పేరుతో కాంగ్రెస్ మోసం చేసిందని బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర అధ్యక్షులు బస్వాపురం లక్ష్మీ నర్సయ్య ఆరోపించారు. వరంగల్ రైతు డిక్లరేషన్ హామీని వెంటనే అమలుచేయాలని డిమాండ్ చేశారు. లేకుంటే రాష్ట్ర వ్యాప్తంగా ఎక్కడికక్కడ కాంగ్రెస్ నాయకులను, మంత్రులను ముట్టడి చేస్తామని హెచ్చరించారు. బీజేపీ రాష్ట్ర పార్టీ పిలుపు మేరకు హనుమకొండ బాలసముద్రం ఏకశిలా పార్క్ వద్ద బీజేపీ కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో హనుమకొండ జిల్లా అధ్యక్షులు కొలను సంతోష్ రెడ్డి అధ్యక్షతన చేపట్టిన రైతు నిరసన దీక్షలో బీజేపీ రాష్ట్ర కిసాన్ మోర్చా అధ్యక్షులు బసవపురం లక్ష్మి నరసయ్యతోపాటు మాజీ ఎమ్మెల్యే మార్తినేని ధర్మారావు, కిసాన్ మోర్చా జాతీయ కార్యదర్శి గోలి మధుసూదన్ రెడ్డి, వరంగల్ జిల్లా అధ్యక్షులు గంట రవికుమార్ తదితరులు పాల్గొన్నారు. రైతు నిరసన దీక్షలో గంట రవికుమార్ మాట్లాడుతూ.. ఎద్దు ఏడ్చిన చోట ఎవుసం.. రైతు ఏడ్చిన చోట రాజ్యం బాగుపడినట్టు చరిత్రలో లేదన్నారు. రైతులు కష్టపడి పండించిన పంట అకాల వర్షాలతో చేతికి రాకుండా మారడం బాధాకరం అన్నారు. ఇలా జరగకుండా ఉండాలంటే కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఫసల్ బీమా యోజన అమలు పరిస్తే రైతులకు ఘోస ఉండదన్నారు. ఫసల్ బీమా యోజన అమలుచేస్తే ఎక్కడ బీజేపీకి మంచి పేరు వస్తుందనే అక్కసుతోనే రాష్ట్ర ప్రభుత్వం దానిని అమలు చేయడంలేదని ఆరోపించారు. ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలతోపాటు ఫసల్ బీమాను అమలు చేయాలనీ, ధాన్యం కొనుగోలు వెంటనే పూర్తిగా చేయాలనీ, పెండింగ్ లో ఉన్న రైతు భరోసా, బోనస్ డబ్బులు చెల్లించాలని, పంట నష్ట పరిహారం చెల్లించాలని డిమాండ్ చేవారు. అకాల వర్షాలతో పంటలు పాడవుతున్నా రేవంత్ సర్కార్ కు చీమ కుట్టినట్టైనా లేదన్నారు. రైతన్న కష్టాలు పట్టని కాంగ్రెస్ ప్రభుత్వానికి కనువిప్పు కలగాలని ఉమ్మడి వరంగల్ జిల్లాలోని ఏకశిలా పార్క్ ముందు బీజేపీ కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో రైతు నిరసన దీక్ష నిర్వహించినట్లు బీజేపీ జిల్లా అధ్యక్షులు గంట రవికుమార్ వెల్లడించారు. రుణమాఫీ కానీ రైతులకు వెంటనే రూ.2 లక్షల రుణమాఫీ చేయాలని, ఎకరాకు రూ.15 వేల చొప్పున రైతు భరోసా డబ్బులు వెంటనే చెల్లించాలని, వరంగల్ రైతు డిక్లరేషన్ వెంటనే అమలు చేయాలని, ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన రాష్ట్రంలో అమలు చేయాలని, రైతులకు క్వింటాల్ కు రూ.500 బోనస్ డబ్బులు వెంటనే చెల్లించాలని, అకాల వర్షాల వల్ల దెబ్బతిన్న పంటలకు ఎకరాకు రూ.30 వేలు నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ దీక్ష కార్యక్రమంలో కిసాన్ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జగన్ మోహన్ రెడ్డి, జాతీయ కౌన్సిల్ మెంబర్ గుజ్జుల ప్రేమేందర్ రెడ్డి, మాజీ పార్లమెంటు సభ్యులు అజ్మీర సీతారాం నాయక్, మాజీ మేయర్ టి.రాజేశ్వర రావు, కిసాన్ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షులు మల్లాడి తిరుపతిరెడ్డి, రాష్ట్ర నాయకులు రావు పద్మారెడ్డి, డాక్టర్ కాళీ ప్రసాదరావు, ఎర్రబెల్లి ప్రదీప్ రావు, చాడ శ్రీనివాసరెడ్డి, కుసుమ సతీష్, రత్నం సతీష్ షా, వన్నాల వెంకటరమణ, కిసాన్ మోర్చా వరంగల్ జిల్లా అధ్యక్షులు బైరి నాగరాజు, రాష్ట్ర, జిల్లా పదాధికారులు, మండల అధ్యక్షులు, కిసాన్ మోర్చా నాయకులు, రైతు సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

# వరంగల్ సీపీగా అవినాశ్ మహంతి?

- సోషల్ మీడియాలో విస్తృత ప్రచారం
- పోలీస్ గ్రూపుల్లో చక్కర్లు కొడుతున్న పోస్టులు

**వరంగల్ వాయిస్, క్రైం :** వరంగల్ నూతన పోలీస్ కమిషనర్ గా అవినాశ్ మహంతిని నియమిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నట్లు సోషల్ మీడియాలో విస్తృత ప్రచారం సాగుతోంది. 2005 బ్యాచ్ కు చెందిన ఆయనకు తెలంగాణ పోలీస్ శాఖలో ప్రత్యేక గుర్తింపు ఉంది. తాను ఎక్కడ పనిచేసినా నిజాయితీకి మారుపేరులా, అక్రమార్కుల పాలిట సింహస్వప్నంలా వ్యవహరిస్తారనే పేరుంది. ప్రస్తుతం సైబరాబాద్ సీపీగా విధులు నిర్వహిస్తున్న అవినాశ్ గతంలో సైబరాబాద్ జాయింట్ కమిషనర్ గా, సైబరాబాద్ డీసీపీ (ట్రాఫిక్) గా, జాయింట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ (డిటెక్టివ్ డిపార్ట్ మెంట్) గా పనిచేశారు. కాగా వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో లా అండ్ ఆర్డర్ ను అదుపులో పెట్టేందుకు మహంతిని తీసుకొస్తున్నట్లు సోషల్ మీడియాతోపాటు పోలీస్ గ్రూపుల్లో చక్కర్లు కొడుతోంది. అయితే నిక్కచ్చిగా వ్యవహరించే అవినాశ్ నియామకాన్ని స్థానిక మంత్రులు, కొందరు ఎమ్మెల్యేలు వ్యతిరేకిస్తున్నట్లు ప్రచారం సాగుతోంది. అంతే కాకుండా ఐజీ స్థాయి అధికారి వరంగల్ కు వచ్చే అవకాశం ఉందా అన్న ప్రచారం జరుగుతోంది.

# మోగిన నగారా..

- డిసెంబర్ 11, 14, 17 తేదీల్లో ఎన్నికలు
- నేటినుంచి ఎన్నికల కోడ్ అమలు

**వరంగల్ వాయిస్, వరంగల్ :** పంచాయతీ ఎన్నికల షెడ్యూల్ ను రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణి కుముదిని విడుదల చేశారు. మూడు దశల్లో పంచాయతీ ఎన్నికలు జరుగుతాయని, ఒక దశకు మరొక దశకు మధ్య రెండు రోజుల వ్యవధి ఉంటుందని తెలిపారు. డిసెంబర్ 11, 14, 17 తేదీల్లో పంచాయతీ ఎన్నికలు నిర్వహిస్తామని ప్రకటించారు. రాష్ట్ర వ్యాప్తంగా నేటి నుంచే ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చిందని చెప్పారు. రాష్ట్రంలో మొత్తం 1,66,55,186 మంది గ్రామీణ ఓటర్లు ఉన్నట్లు వెల్లడించారు. ఎన్నికలను ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పోలింగ్.. అదేరోజు మధ్యాహ్నం 2 గంటల నుంచి కౌంటింగ్, ఫలితాల ప్రకటన ఉంటుందన్నారు. ఈ నెల 27 నుంచి మొదటి దశ ఎన్నికలకు నామినేషన్ల ప్రక్రియ ప్రారంభం అవుతుందని ప్రటించారు. 30నుంచి రెండో విడత, డిసెంబర్ 3నుంచి మూడో విడత ఎన్నికలకు నామినేషన్ల స్వీకరణ చేపట్టనున్నట్లు తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా 545 మండలాల్లోని 12,733 గ్రామాల్లో సర్పంచులు, వార్డు సభ్యుల ఎన్నికలను సమర్థవంతంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేయనున్నట్లు రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణి కుముదిని తెలిపారు.

# పేదలకు సేవ చేయడమే లక్ష్యం

- జిల్లా అభివృద్ధి పథంలో దూసుకుపోతోంది
- ఎంపీ కడియం కావ్య



**వరంగల్ వాయిస్, జనగామ :** మనందరి ప్రధాన కర్తవ్యం పేదలకు సేవ చేయడమేనని వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు, దిశ కమిటీ చైర్మన్ డాక్టర్ కడియం కావ్య అన్నారు. కడియం కావ్య అధ్యక్షతన జిల్లా కలెక్టరేట్ లో మంగళవారం జరిగిన 'దిశా' (జిల్లా అభివృద్ధి సహకార మరియు మానిటరింగ్ కమిటీ) సమావేశంలో స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి, కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్, అదనపు కలెక్టర్ లు పింకేష్ కుమార్, బెన్ షాలోమ్, డీసీపీ రాజమహేంద్ర నాయక్ పాల్గొన్నారు. ముందుగా జల సంరక్షణకై వివిధ చర్యలని చేపట్టి కేంద్రం నుంచి జిల్లాకి జల పురస్కారం వచ్చేలా కృషి చేసిన జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ ని ఎంపీ, శాసనసభ్యులు అభినందించారు. అనంతరం.. జిల్లా గ్రామీణభివృద్ధి శాఖ, విద్య, వైద్యం, ఆరోగ్యం, జాతీయ రహదారుల విభాగం, రోడ్ల భవనాలు, తదితర శాఖల ద్వారా జిల్లాలో అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాల పురోగతి ని క్షుణ్ణంగా సమీక్షించారు. కేంద్రం పరిధిలోని పలు శాఖల పనితీరుపై చర్చించారు. కొత్తగా చేపట్టాల్సిన పనులపై దిశా నిర్దేశం చేశారు. అనంతరం ఎంపీ కడియం కావ్య మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలపై నిరంతర పర్యవేక్షణ చేయాలని అన్నారు. జిల్లాలో సాధారణ డిలీవరీలు జరగాలని, గ్రామాలలో మహిళ గర్భం దాల్చినప్పటినుంచి ఆశా వర్కర్లు, అంగన్వాడీ టీచర్లు పర్యవేక్షణ చేయాలన్నారు. సాధారణ డెలివరీలు పెంచేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. స్టేషన్ ఘనపూర్ శాసనసభ్యులు కడియం శ్రీహరి మాట్లాడుతూ జిల్లాలో జాతీయ ఉపాధి హామీ పథకాన్ని వ్యవసాయానికి అనుసంధానం చేసే దిశగా చర్యలు తీసుకోవాలని అన్నారు. కేంద్ర ప్రభుత్వం తగ్గించిన ఉపాధి హామీ పని దినాలుపెంచే విధంగా కేంద్రానికి విజ్ఞప్తి చేయాలని సూచించారు. అలాగే మహిళా స్వయం సహాయక సంఘాల ద్వారా మండలానికి ఒక సోలార్ ప్లాంట్ జిల్లాలోని 12మండలాలలో ఏర్పాటు చేయాలన్నారు. ఈ సమావేశంలో డీఆర్డీవో వసంత, దిశా కమిటీ సభ్యులు మాధవి, వివిధ శాఖలకు చెందిన అధికారులు పాల్గొన్నారు.

స్వదేశాగమన శుభాకాంక్షలు

థాయిలాండ్ రాజధాని బ్యాంకాక్, పటాయ్ లో ఈనెల 21 నుంచి 23 వరకు జరిగిన అంతర్జాతీయ షటిల్ టోర్నమెంట్ లో భారతదేశం తరుపున పాల్గొని స్వదేశానికి తిరిగి వస్తున్న జాతీయ షటిల్ క్రీడాకారులు బొద్దిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, గడ్డం కేశవమూర్తి, ముచ్చ రాజిరెడ్డిలకు వరంగల్ వాయిస్ స్వాగతం పలుకుతోంది. 55 ప్లస్ వెటరన్ డబుల్స్ విభాగంలో వీరు వరుసగా థాయిలాండ్, శ్రీలంక, చైనా, మలేషియా దేశ క్రీడాకారులతో తలపడి దేశ కీర్తిని ఇనుమడింపజేశారు. విజయవంతంగా తమ పర్యటనను ముగించుకొని తిరిగి వస్తున్న సందర్భంగా వారికివే మా శుభాబివందనాలు..



ఇట్లు.. వరంగల్ వాయిస్ కుటుంబం
సామల సూర్యప్రకాశ్, వెన్ను రాము, గోలి రవి, సిద్ధోజు రాకేశ్, ఉస్నగిరి శ్రీకాంత్, బొజ్జం చొక్కారావు, పూజారి విజయ్

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY GADDAM KESHAVA MURTHY, PRINTED AT MANIKANTA GRAPHICS, H.NO.4-10-121, KUMARPALLY, HANAMKONDA, WARANGAL URBAN DISTRICT-506001, TELANGANA STATE, PUBLISHED AT H.NO. 4- 7-138/1, KUMARPALLY, HANAMKONDA, WARANGAL.-506001. WARANGAL URBAN DISTRICT, TELANGANA STATE. EDITOR : GADDAM KESHAVA MURTHY. RNI NO: TELTEL/2021/80377, PHONE NO : 8008794162, MAIL ID : gaddamkeshavamurthy@gmail.com